VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A, New Zealand)
1-10-3, Ashok Nagar, Hyderabad-20, INDIA
+91(40) 27626184, 27674037
victoria.ashoknagar@gmail.com
www.victoriaoverseas.com
AAERI
QEAC No. E334

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 344, పేజీలు - 08
గురువారం, జూన్ 4, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్
ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక
HYDERABAD

Host On Your Domain
Hosting / Admin Panel
Page Builder / Social Links
Responsive Design
Advertisement Spaces
Search Engine Optimization
XML Sitemap
Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

## ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా

# హైదరాబాద్



- సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ
- తెలంగాణలో పెట్టుబడులు, వాణిజ్యంపై ప్రధానంగా చర్చలు
- ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో సహకారానికి అంగీకారం
- పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ హామీ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడులు, విద్య, వైద్య సేవలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలకమైన అడుగు వేసింది. అందులో భాగంగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని ఇరు పక్షాలు చర్చించాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు.

### హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు

తెలంగాణ ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఐటీ, ఫార్మా, రక్షణ, ఏరోస్పేస్ వంటి అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే విధంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. అనేక ప్రపంచ ప్రఖ్యాత ఫార్చ్యూన్-500 కంపెనీలు తమ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాయని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు హైదరాబాద్‌ను నాలెడ్జ్ సిటీగా మార్చాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వైద్య రంగంలో తెలంగాణ సాధించిన పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో మధ్యప్రాచ్య దేశాలతో పాటు అనేక దేశాల ప్రజలు చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. అత్యాధునిక ఆసుపత్రులు, నిపుణులైన వైద్యులు, మెరుగైన ఆరోగ్య మౌలిక వసతులు తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు.

2లో..

## కర్ణాటక సీఎంగా
# డీకే శివకుమార్ ప్రమాణం

- ప్రమాణం చేయించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్
- కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే
- కేబినెట్లో సిద్ధరామయ్య తనయుడికి చోటు



బెంగుళూరు (ప్రశ్న న్యూస్) కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్‌తో గవర్నర్ థావర్ చంద్ గహ్లోట్ ప్రమాణస్వీకారం చేయించారు. బుధవారం సాయంత్రం బెంగళూరులోని లోక్‌భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో ఈ కార్యక్రమం జరిగింది. డీకే ప్రమాణస్వీకార వేడుకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, కేరళ, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, రేవంత్ రెడ్డి, సుఖ్విందర్ సింగ్ సుఖు తదితరులు

2లో..

## తెలంగాణ నాలుగు కోట్ల మంది
# జాగీర్



-తెలంగాణకు మా ఓజీ కేసీఆర్ చాలు

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్
- తెలంగాణ ఇక్కడి భూమిపుత్రుల జాగీరని వ్యాఖ్య
- పవన్ ఎక్కడైనా పోటీ చేసుకోవచ్చన్న కేటీఆర్
- కానీ, సెక్రటేరియట్‌లో పెత్తనం చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రాంతీయ వాదాన్ని పెంచుకుంటూ పోతే దేశం విచ్ఛిన్నమవుతుందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన కామెంట్స్ దుమారం రేపుతున్నాయి. ఉగ్రవాదుల్లా మాట్లడం దేశానికే మంచిది కాదని ఆయన హితవు పలికారు. దీన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. హైదరాబాద్‌లో మీట్‌ది ప్రెస్‌లో మాట్లాడుతూ ప్రాంతీయ వాదం ఉగ్రవాదం అయితే పొట్టి శ్రీరాములు చేసింది ఏంటని ప్రశ్నించారు. ఆయన భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం కాకుండా మద్రాస్ నుంచి విడిగొట్టాలని దీక్ష చేయలేదా అని నిలదీశారు.

### తెలంగాణ ప్రజల జాగీరే!

తెలంగాణ కచ్చితంగా తెలంగాణ భూమి పుత్రుల జాగీరు అని కేటీఆర్ ఘాటుగా కామెంట్ చేసారు. ఇందులో ఎవరికీ అనుమానం అవసరం లేదన్నారు. 100% ఈ నేల కోసం కష్టపడ్డ వాళ్లు, ఈ నేల కోసం పోరాటాలు చేసినవాళ్లు, ఈ నేల కోసం త్యాగాలు చేసినవాళ్లు ఉన్నారని అన్నారు. వారి నెత్తురుతో తడిచిన నేల వారి జాగీరే అని అన్నారు. ముమ్మాటికీ తెలంగాణ ఇక్కడున్న నాలుగు కోట్ల మంది జాగీరేనని స్పష్టం చేశారు.

### పొట్టి శ్రీరాములది, మోదీది కర్షీడ ఉగ్రవాదమేనా?

కుటుంబాలతో తెలంగాణ వచ్చి ఉండాలని, వ్యాపారులు చేసుకోవాలని, స్థిరపడాలని కేటీఆర్ సూచించారు. అలా ఉండొద్దని, తిరగొద్దని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. 10, 12 ఏళ్లలో ఎక్కడైనా చిన్న సమస్య వచ్చిందా? అని అడిగారు. ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నామని కేటీఆర్ తెలిపారు. "పవన్ ప్రాంతీయవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదం అన్నారు. నేను వారికి గుర్తు చేస్తా ఉన్నా ప్రాంతీయవాదం అంటే మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రం వేర్పడాలని పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేశారు,

2లో..

## దేశంలో రవాణా రంగం
# ఆధునీకరణ

- కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయాలు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశంలో రవాణా రంగం ఆధునీకరణ, వాయు కాలుష్య నివారణ, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏకంగా రూ. 39,290 కోట్ల భారీ ప్యాకేజీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. పశ్చిమాసియా యుద్ధం, పాక్ గగనతల మూసివేత కారణంగా దేశీయ విమానయాన రంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర కేబినెట్ సరికొత్త వ్యూహాత్మక ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ధరల భారం నుంచి విమానయాన సంస్థలను కాపాడేందుకు చమురు సంస్థలకు 10 వేల కోట్లను వడ్డీ లేని ఆర్థిక సాయంగా ప్రకటించింది. దీనివల్ల ఇంధన ధరలు పెరిగినా, విమాన టికెట్ల ధరలు అకస్మాత్తుగా పెరగకుండా ప్రయాణికులకు ఉపశమనం లభిస్తుంది. ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు

2లో..

# కోటి మందితో యోగాంధ్ర-2026

- 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' థీమ్‌తో యోగాంధ్ర-2026 కార్యక్రమం
- పర్యాటక కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు
- యోగాంధ్ర కోసం రూ.10 కోట్ల బడ్జెట్, ప్రత్యేక పోర్టల్ ప్రారంభం
- జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది భాగస్వామ్యంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగాంధ్ర-2026' పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమ నిర్వహణ, లక్ష్యాలపై ఆయన అమరావతిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా అని, దానిని ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించడం) థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. "యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా మార్చుకోవాలి. ఈ లక్ష్యంతో జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటిస్తున్నాం. జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయి" అని వివరించారు. ప్రధాన కార్యక్రమం అమరావతిలో కృష్ణానది పశ్చిమ బైపాస్

2లో..

## భూముల ధరల సవరణకు
# సర్కార్ గ్రీన్ సిగ్నల్

- జూన్ 5 నుంచి కొత్త రేట్లు
- భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ
- పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు
- శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించినట్టు తెలిపిన మంత్రి పొంగులేటి
- వాస్తవ ధరలకు అనుగుణంగా మార్పులు చేసినట్టు వెల్లడి




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో భూముల ధరల సవరణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సవరించిన ధరలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా

2లో..

## తెలంగాణ 100 శాతం
# భూమిపుత్రుల జాగీరే

- మనసుల్లో విభజన రేఖలు వద్దన్నా పవన్ కల్యాణ్




అమరావతి (ప్రశ్న న్యూస్) అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించిన అనంతరం జనసేనాని, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ సభ వివాదం,

2లో..

## మలక్కా జలసంధిపై పట్టు కోసం
# భారత్ భారీ వ్యూహం

- గ్రేట్ నికోబార్ దీవిలో 9 బిలియన్ డాలర్లకు పైగా వ్యయంతో మెగా ప్రాజెక్ట్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రపంచ వాణిజ్యంలో ఇరాన్‌కు హర్మూజ్ జలసంధి ఎంత కీలకమో, హిందూ మహాసముద్రంలో మలక్కా జలసంధి కూడా అంతే వ్యూహాత్మకమైనది. ఇప్పుడు ఆ జలసంధిపై పట్టు సాధించి, ఇండో-పసిఫిక్‌లో చైనాకు చెక్ పెట్టేందుకు భారత్ ఓ భారీ ప్రణాళికతో ముందుకెళుతోంది. ఇందులో భాగంగా అండమాన్ నికోబార్ దీవుల్లోని గ్రేట్ నికోబార్

2లో..

# డీఎస్సీ 2025పై సీబీఐ విచారణ చేయాలి

- వైసీపీ అధినేత వైఎస్ జగన్ డిమాండ్




**అమరావతి (ప్రశ్న న్యూస్)** కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ -2025పై సీబీఐ విచారణకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిపించి, అన్నింటా సక్సెస్ అయిన అనేక మంది డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు రాకపోవడం అత్యంత హేయమని మండిపడ్డారు. పలువురు డీఎస్సీ అభ్యర్థులతో వైసీపీ కేంద్ర కార్యాలయంలో జగన్ సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్ డీఎస్సీ పరీక్ష నిర్వహణ, ఎంపికలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఇష్టారాజ్యంగా జీవోలు జారీ చేసి, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇచ్చారని, దీంతో ఎంతోమంది అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు. వారి తరపున వైసీపీ న్యాయ పోరాటం చేస్తుందని ఇందుకోసం లీగల్ ప్యానెల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే వైసీపీ పార్టీ అధికారంలోకి రాగానే, విచారణ కమిషన్ ఏర్పాటు చేసి ఈ అక్రమాలపై దర్యాప్తు జరుపుతామని, అన్యాయానికి గురైన అభ్యర్థులకు అవసరమైతే

2లో..

# ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

- దక్షిణ ఢిల్లీ హోటల్‌లో ఉదయం ఘోర అగ్నిప్రమాదం
- ఈ ఘటనలో 21 మంది మృతి, వీరిలో ఎక్కువ మంది విదేశీయులు
- వైద్య చికిత్సల కోసం భారత్‌కు వచ్చిన వారు బస చేసిన హోటల్‌లో దుర్ఘటన
- గ్రౌండ్ ఫ్లోర్‌లోని రెస్టారెంట్‌లో మంటలు చెలరేగినట్టు ప్రాథమిక అంచనా

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. మాలవీయ నగర్‌లోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో మంటలు చెలరేగి 21 మంది సజీవదహనమయ్యారు. బాధితుల్లో ఎక్కువ మంది విదేశీయులే ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం నుంచి మరో 40 మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. లోపల ఇంకొందరు చిక్కుకున్నట్టు సమాచారం. ప్రమాదం నుంచి కాపాడుకొనేందుకు పైఅంతస్తుల్లో ఉన్నవారు కిటికీలు, బాల్కనీల నుంచి కిందకు దూకారు.

2లో..



# ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

### మెడికల్ టూరిజంకు ప్రత్యేక స్థానం

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికాతో కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించవచ్చని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గత ఏడాది నిర్వహించిన "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025" భారీ విజయాన్ని సాధించిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు పాల్గొనడంతో తెలంగాణకు కొత్త పెట్టుబడి అవకాశాలు లభించాయని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026"లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి ఆహ్వానించగా దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు వెంటనే స్పందించి పెద్ద సంఖ్యలో బృందంతో ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం ద్వారా తెలంగాణ-దక్షిణాఫ్రికా మధ్య విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడులు, పరిశ్రమల రంగాల్లో కొత్త సహకార అవకాశాలకు మార్గం సుగమమైందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

### నెట్ జీరో విధానంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం

అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును గురించి కూడా సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. పూర్తిగా పర్యావరణహితంగా, నెట్ జీరో విధానంలో, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భవిష్యత్ పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, పరిశోధనా కేంద్రాలకు ఇది కేంద్రంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### తెలంగాణలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం

తెలంగాణలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పారదర్శక పారిశ్రామిక విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని పేర్కొన్నారు. దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని ఆహ్వానించారు. బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మెగా ఆసుపత్రులను నిర్మిస్తోందని చెప్పారు. ఆరోగ్య రంగంలో తెలంగాణ-దక్షిణాఫ్రికా భాగస్వామ్యం ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటుందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోద రాజనర్సింహ పేర్కొన్నారు.

### భారత్‌తో సౌత్ ఆఫ్రికాది చారిత్రక బంధం: పాల్ మషాటిలే

భారతదేశంతో దక్షిణాఫ్రికాది చారిత్రక బంధమని ఆ దేశ ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్, దక్షిణాఫ్రికాల మధ్య దశాబ్దాలుగా బలమైన సాంస్కృతిక సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా భారత కంపెనీలు ఆఫ్రికా మార్కెట్లలోకి విస్తరించేందుకు దక్షిణాఫ్రికా కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఫార్మా, ఆరోగ్య రంగాల్లో భారత కంపెనీలకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని, భవిష్యత్తులో మరింత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.కాగా ఈ సమావేశానికి దక్షిణాఫ్రికా అంతర్జాతీయ సంబంధాల ఉప మంత్రి మొరాకా, భారతదేశానికి దక్షిణాఫ్రికా రాయబారి ఏ. సూక్‌లాల్, ఆరోగ్య మంత్రి డాక్టర్ ఏ. మోట్సోలెడీ, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి ఎస్. ఎండాబేని, విజ్ఞాన సాంకేతిక శాఖ ఉపమంత్రి ఎన్. గినా, కమ్యూనికేషన్స్, డిజిటల్ టెక్నాలజీ శాఖ ఉపమంత్రి ఎం. గుంగుబెలే తదితరులు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మలక్కా జలసంధిపై పట్టు కోసం

# భారత్ భారీ వ్యూహం

దీవిలో సుమారు 9 నుంచి 11 బిలియన్ డాలర్ల భారీ వ్యయంతో మెగా అభివృద్ధి ప్రాజెక్టును వేగవంతం చేసింది. భారత ప్రధాన భూభాగానికి 1,600 కిలోమీటర్ల దూరంలో, మలక్కా జలసంధికి అత్యంత సమీపంలో ఉన్న ఈ దీవిలో అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్, సైనిక-పౌర అవసరాలకు ఉపయోగపడే విమానాశ్రయం, విద్యుత్ కేంద్రం, భారీ టౌన్‌షిప్ నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ వాణిజ్యంలో మూడింట ఒక వంతు, చైనా ముడి చమురు దిగుమతుల్లో దాదాపు 80 శాతం ఈ జలసంధి గుండానే జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ భారత ఉనికిని బలోపేతం చేయడం ద్వారా సముద్ర వాణిజ్య మార్గాలపై నిఘా పెట్టవచ్చని రక్షణ నిపుణులు భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యర్థుల కదలికలను సులభంగా పర్యవేక్షించవచ్చని భారత నౌకాదళ మాజీ వైస్ చీఫ్ శేఖర్ సిన్హా వంటి నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అల్ జజీరా కథనం ప్రకారం, ఈ ప్రాజెక్టుకు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) నుంచి పర్యావరణ అనుమతులు కూడా లభించాయి. దీంతో నిర్మాణం పనులు కూడా మొదలయ్యాయి. అయితే, ఈ భారీ ప్రాజెక్టుపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత అరుదైన షోంపేన్, నికోబరేస్ ఆదివాసీ తెగలు నివసించే ఈ ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణం వారి ఉనికికే ప్రమాదకరమని మానవ హక్కుల సంఘాలు హెచ్చరిస్తున్నాయి. దాదాపు 10 లక్షల చెట్లను నరికివేయాల్సి రావడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా ఇక్కడ పర్యటించి, సహజ, గిరిజన వారసత్వాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఆందోళనల మధ్యే, జాతీయ భద్రతకు అత్యంత కీలకమంటూ కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్తోంది.

## కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం

హాజరయ్యారు. రాజ్యాంగాన్ని చేతితో పట్టుకుని డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు ఆయన సాష్టాంగ నమస్కారం చేయడం విశేషం. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రిగా జి.పరమేశ్వర ప్రమాణస్వీకారం చేశారు. మంత్రులుగా సిద్ధరామయ్య తనయుడు యతీంద్ర, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే,కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, సతీశ్ జర్కిహోళి, రామలింగారెడ్డి, కృష్ణబైరె గౌడ, మాజీ స్పీకర్ యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌తో గవర్నర్ ప్రమాణం చేయించారు.సాధారణంగా సీఎం ప్రమాణ స్వీకార వేదిక ద్వారాలు, కార్యాలయంలోని ఆసనాలన్నీ జ్యోతిశాస్త్ర ప్రకారమే మార్చడ విశేషం. ఏఐసీసీ నుంచి విశిష్ట అతిథులు, రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ప్రత్యేక అతిథులుగా.. పలు రంగాల ప్రముఖులను గౌరవ అతిథులుగా ఆహ్వానించారు. మొత్తం 1100 మందికి లోక్‌భవన్ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి 3 వేల మంది పోలీసులతో భద్రత కల్పించారు. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, అధికారం చేపట్టింది. అయితే, ఆ సమయంలోనే సీఎం పదవి కోసం డీకే తీవ్రంగా ప్రయత్నించారు. కానీ, సీనియర్ నేత సిద్ధరామయ్యకు అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. రెండున్నరేళ్ల తర్వాత అవకాశం కల్పిస్తామని అప్పట్లో హైకమాండ్ మాట ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. గతేడాది నవంబరుతో సగం కాలం పూర్తికాగా.. నాయకత్వ మార్పుపై తీవ్ర చర్చ జరిగింది. కానీ, తాత్కాలికంగా ఆ సంక్షోభాన్ని నివారించిన కాంగ్రెస్ పెద్దలు.. చివరకు సిద్ధరామయ్యను ఒప్పించి రాజీనామా చేయించారు.

## తెలంగాణ నాలుగు కోట్ల మంది జాగీర్

అది కూడా ప్రాంతీయవాదం అంటారా? ప్రాంతీయవాదం అంటే నేను ఇంకో ప్రశ్న అడుగుతా ఉన్నా పవన్ ని... మోడీ ఆయన ప్రాంతం మీద అభిమానంతో, ప్రాంతీయవాదంతో తెలంగాణకు వచ్చిన ఇండస్ట్రీలను పట్టుకొని పోతా ఉన్నారు. మరి జాతీయవాదం ముసుగులో చేస్తున్న ఈ ఆర్థిక ప్రాంతీయవాదం కరెక్టా? ఏది కరెక్టు? అంటే ప్రధానమంత్రి గుజరాత్‌కే ప్రధానమంత్రిగా వ్యవహరించడం కరెక్టా? చెప్తారా దీనికి సమాధానం పవన్ ?" అని నిలదీశారు.

### పవన్ జాతీయ పాఠాలు అక్కర్లేదు

అసలు వివాదమే లేని జనగణమన, వందేమాతరం విషయాలను ఇప్పుడు ప్రస్తావించాల్సిన అవసరం ఏం వచ్చిందని కేటీఆర్ డౌట్ ఎక్స్‌ప్రెస్ చేశారు. కావాలనే ప్రజలను రెచ్చగొట్టేందుకు ఇలాంటివి చేస్తున్నారని మండిపడ్డారు. "జనగణమన పాడరు అని. మాకు జనగణమన మాకు నేర్పించాల్సింది ఏమీ లేదు. దేశభక్తి గురించి మాకు పవన్ దగ్గర పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు. ఈ నేల ఆనాడు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన నేల. కమ్యూనిస్టులు కదంతొక్కిన నేల ఇది. కాబట్టి మాకు పోరాటాలు కొత్తగాదు, మాకు యుద్ధాలు కొత్తగాదు, త్యాగాలు కొత్తగాదు. మాకు వాటి గురించి జాతీయ భావన ఉంది ఇక్కడ, దేశాన్ని గౌరవించే సంస్కృతి ఉంది." అని అన్నారు.

### పవన్‌ను గౌరవిస్తాం, బిర్యానీ పెడతాం కానీ..

పవన్ ను ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా వారిని గౌరవిస్తామన్నారు కేటీఆర్. ఒక కళాకారుడిగా, ఒక నటుడిగా అభిమానిస్తామని తెలిపారు. ఒక సోదరుడిగా ఇంటికి వస్తే బిర్యానీ పెడతామని చెప్పారు. కానీ, వచ్చి మా సెక్రటేరియట్‌లో కూర్చొని పెత్తనం చేస్తాం అంటే ఒప్పుకోమన్నారు. 60 ఏళ్ల పోరాటం చేసి మొన్న వేరుపడ్డామని, పవన్‌ది ఈ మధ్యనే 'ఓజీ' అని సినిమా వచ్చిందని ఇక్కడ అసలైన తెలంగాణ ఓజీ మా కేసీఆర్ ఉన్నారని అన్నారు. ఆయన తెలంగాణను కాపాడుకుంటారని పేర్కొన్నారు.

"ఈ దేశంలో ఏ నాయకుడైనా, ఏ నాయకురాలైనా పార్టీ పెట్టవచ్చు. పార్టీ పెట్టి ఎక్కడైనా పోటీ చేయవచ్చు. ఏ ప్రాంతంలోనైనా, ఏ రాష్ట్రంలోనైనా నిరభ్యంతరంగా పోటీ చేయవచ్చు. ప్రజాస్వామ్య భారతంలో అది అందరికీ ఉన్న హక్కు, రాజ్యాంగం ఇచ్చిన హక్కు, బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన హక్కు. ఇందులో ఏమీ అనుమానం పడక్కర్లేదు. కానీ, ఏ ప్రాంతంలోనైతే మీరు పోటీ చేయాలనుకుంటున్నారో, ఆ ప్రాంత ఆకాంక్షలు, ఆ ప్రాంత పరిస్థితులు, ఆ ప్రాంత ప్రజలు, వారి మనోభావాలు, వారి పోరాటాలు, వారి త్యాగాలు కూడా తెలుసుకోవాలి, వారి మీద అభిమానం ఉండాలి." అని పేర్కొన్నారు.

### పవన్ కళ్యాణ్ జనసేన కొత్తగా పోటీ చేసేదేముంది?

2023లో జనసేన పోటీ చేసిందని కేటీఆర్ గుర్తు చేశారు. "2023లో పోటీ చేయలేదా మీరు? చేశారు కదా అసెంబ్లీ ఎన్నికల్లో. మొన్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు కదా 350 వార్డుల్లో, కొత్తగా చేసేదేముంది? మిమ్మల్ని ఎవరు ఆపుతున్నారు? 2018లో చంద్రబాబు నాయుడు వచ్చారు, పోటీ చేశారు. 23లో మీరు పోటీ చేశారు. పోటీ చేయండి, ఎవడొద్దంటున్నాడు? కానీ, మీరు ఇక్కడికి వచ్చి మాట్లాడేటప్పుడు, ఇదేదో ఆశామాషీగా ఏర్పడ్డ రాష్ట్రం కాదు. ఇదేదో అనాయాసంగా వచ్చిన రాష్ట్రం కాదు. వేల మంది బలిదానాలతో, రక్తంతో తడిసిన నేల ఇది తెలంగాణ."ఇక్కడికి వచ్చినప్పుడు, ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని మాట్లాడాలని కేటీఆర్ సలహా ఇచ్చారు. "జనసేనను ఎవరు అడ్డుకుంటున్నారు ? ఏదో ఊహాజనితమైన ఒక ప్రపంచం సృష్టించుకుని, ఎవరు అడ్డుకుంటున్నారు మిమ్మల్ని? 2018లో పోటీ చేస్తే అడ్డుకోలేదు, 2023లో పోటీ చేస్తే అడ్డుకోలేదు, ఇప్పుడెవరు అడ్డుకున్నారు? మేమేం చేస్తాం దానికి?" పవన్, ఎవరైనా సరే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు వచ్చి, ఇక్కడ సభ పెడతాం అంటే భావోద్వేగాలు రగులుతాయి. అది కూడా గతంలో తెలంగాణ ఏర్పడ్డప్పుడు ఆ విభజించిన పద్ధతి నచ్చలేదు అన్న వ్యక్తి అలా చేస్తే ఊరుకుంటారా. తెలంగాణ ఏర్పడటం ఇష్టం లేకే ఇలాంటివి చెబుతున్నరాని అన్నారు. " ఇది బాగాలేదు, అది బాగాలేదు అని. మరి అది బాగాలేకపోతే, ఇది బాగాలేకపోతే, 11 రోజులు అన్నం ముట్టకుండా ఉంటే, మళ్లీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీటింగ్ పెట్టాల్సిన అవసరం ఉందా? మీటింగ్ పెడదాం అనుకున్నావ్, అడ్డుకున్నదెవరు? కాంగ్రెస్ ప్రభుత్వం. ఏమన్నా అనాలనుకుంటే వాళ్లననాలి. కాబట్టి, పవనైనా ఎవరైనా ఈ దేశంలో ఎక్కడైనా పోటీ చేయొచ్చు, మాకు అభ్యంతరం లేదు. పోటీ చేశారు కూడా కదా మీరు. 2023 మే భీ ఆప్ బహుత్ కరే.

## పవన్ కళ్యాణ్‌పై గద్దర్ కూతురు వెన్నెల ఫైర్

**హైదరాబాద్** పవన్ వ్యాఖ్యలను గద్దర్ బిడ్డ వెన్నెల ఖండించారు. తెలంగాణ గడ్డ నిన్న మా అయ్యల జాగీరే...తెలంగాణ గడ్డ ఈరోజు మా జాగీరు. రేపు మా బిడ్డల జాగీరని అన్నారు. నటుడిగా, గద్దర్ అభిమానిగా పవన్ ను అభిమానిస్తారు. పైసలు పంచితేనో, లాబీలు చేస్తేనో తెలంగాణ రాలేదు... తెలంగాణ ఉద్యమం ఆత్మ గౌరవ పోరాటం. ఉద్యమంలో ప్రాణాలు తీసుకున్నాం కానీ ఎవర్ని ఒక్క మాట కూడా అనలేదు. త్యాగాలు చేసి తెలంగాణ తెచ్చుకున్నాం. తెలంగాణ అన్నందుకు చాలా మందిని ఎన్కౌంటర్ చేశారు. ఉద్యమంలో చాలా మంది తల్లులు తమ బిడ్డల్ని కోల్పోయారని అన్నారు.

## దేశంలో రవాణా రంగం ఆధునీకరణ

పాత వాణిజ్య వాహనాలను మార్చే భారీ ప్రాజెక్ట్ కు కేబినెట్ ఆమోదం తెలిపింది. 1.9 లక్షలకు పైగా పాత ట్రక్కులు, 16 వేల పాత బస్సులను స్క్రాప్ చేసి వాటి స్థానంలో కొత్త బీఎస్-6 లేదా ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే కొత్త వాహనాల కొనుగోలుపై తీసుకునే రుణాలపై 5 శాతం వడ్డీ రాయితీ ప్రకటించింది. చమురు కంపెనీల ద్వారా ఐదేళ్లపాటు ప్రతి నెలా ఉచిత ఇంధన ఓచర్లు అందనున్నాయి. అలాగే ఆటోమొబైల్ తయారీదారుల నుంచి ప్రత్యేక డిస్కౌంట్లు వస్తాయి. అంతేకాక కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు, 10 సంవత్సరాల పాటు 100 శాతం మోటార్ వాహన పన్ను మినహాయింపు ఉంటుంది. ఇక రూ. 24, 24 9 కోట్లతో భారీ రహదారుల విస్తరణకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణకు చెందిన ఎన్హెచ్-63, ఎన్హెచ్-563 జాతీయ రహదారుల విస్తరణకు ఆమోదం దక్కింది. దేశవ్యాప్తంగా కనెక్టివిటీని మెరుగుపరచడం అలాగే ప్రయాణ సమయాన్ని తగ్గించడం, సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో ఈ రహదారి ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు కేబినెట్ పేర్కొంది.

## తెలంగాణ 100 శాతం భూమిపుత్రుల జాగీరే

తెలంగాణ నేతల కౌంటర్లు, ఏపీ రాజకీయాలపై భావోద్వేగంతో మాట్లాడారు.

### గద్దర్ ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు

తెలంగాణ నేతల జాగీరు వ్యాఖ్యలపై పవన్ కల్యాణ్ తనదైన శైలిలో స్పందించారు. తెలంగాణ 100 శాతం ఇక్కడి భూమిపుత్రుల జాగీరే, అందులో ఎలాంటి సందేహం లేదు, కాదని ఎవరన్నారు కానీ నన్ను అడుగుపెట్టనివ్వను అనడం సరికాదు. ప్రజా గాయకుడు గద్దర్ అన్నా ఎప్పుడూ ఇలాంటి సంకుచిత భాష మాట్లాడలేదు అని గుర్తుచేశారు. తెలంగాణపై తనకు అపారమైన ప్రేమ ఉందన్న పవన్.. రెండు రాష్ట్రాల్లోనూ లక్షలాది మంది నిరుద్యోగ పట్టభద్రులు ఉన్నారని, వారి అభివృద్ధిని పట్టించుకోకుండా కొందరు నేతలు కుల దూషణలకు, ప్రాంతీయ విద్వేషాలకు దిగుతున్నారని మండిపడ్డారు. భూమికి సరిహద్దులు వేయగలరు కానీ, మనసుల్లో వేసే విభజన రేఖలు చాలా లోతుల్లోకి వెళ్తాయని, వీటికి చరమాంకం పలకాలని తాము నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు.

### కేటీఆర్‌తో బ్రదర్లీ రిలేషన్.. కాంట్రాక్టులపై నిలదీత

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు పవన్ ఆసక్తికర సమాధానమిచ్చారు. కేటీఆర్‌కి నాకు మధ్య ఉన్నది బ్రదర్ రిలేషన్ షిప్ . మా ఇద్దరికీ పరస్పర గౌరవం, ఇష్టాలు ఉన్నాయి. ఆయన నా సభపై ఏమన్నారో నేను పూర్తిగా చూడలేదు కానీ, నాకు తెలిసి ఆయన తప్పుగా మాట్లాడి ఉండరు అని పేర్కొన్నారు. ఇదే సమయంలో ఆంధ్రా వాళ్లకు కాంట్రాక్టులు ఇవ్వమంటున్న కాంగ్రెస్ నేతలపై పవన్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 2014 నుంచి ఇప్పటిదాకా ఏపీకి చెందిన ఎంతమంది ఇక్కడ తెలంగాణ వాళ్లు కాంట్రాక్ట్ తీసుకున్నారో లెక్కలు తీయండి? ఇలాంటివి మాట్లాడి ప్రజల మధ్య లేనిపోని ద్వేషం తీసుకురాకండి అని హితవు పలికారు. తెలంగాణలో రేపు జనసేన తరఫున ఆంధ్రా నాయకులు వచ్చి పోటీ చేయరని, ఇక్కడి స్థానిక నాయకులేపోటీ చేస్తారని, అలాంటప్పుడు వారు సభ పెట్టుకుంటే ఆపేందుకు వీరెవరని నిలదీశారు.

### రౌడీయిజానికి భయపడం - అందుకే 11 సీట్లకు పడిపోయారు!

గతంలో సభలను అడ్డుకున్న వారి గతి ఏమైందో అందరూ చూశారని పవన్ కల్యాణ్ పరోక్షంగా బీఆర్ఎస్, వైఎస్ఆర్‌సీపీలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సభలు పెట్టనియ్యకపోతేనే కదా నాడు 11 సీట్లకు వచ్చింది. ఇక్కడ రౌడీయిజం చేస్తామంటే భయపడటానికి ఎవరూ లేరు. రౌడీయిజానికి భయపడితే మేము రాజకీయాలు చేస్తామా అని ఘాటుగా ప్రశ్నించారు. ఏపీలో తాము పదేళ్లు క్షేత్రస్థాయిలో ఎన్నో కష్టాలు పడితేనే ఇంతమంది ఎమ్మెల్యేలు వచ్చారని, రేపు తెలంగాణలో కూడా జనసేన కేడర్ ఇక్కడి ప్రజల కోసం, అభివృద్ధి కోసం గట్టిగా పనిచేస్తుందని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

### ఆ పేరు వింటేనే చిరాకు

మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ అంశంపై పవన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎందుకులెండి ఆ పేరు వింటేనే చిరాకు పుడుతుంది. మూడు రాజధానులు అన్నారు అది కాస్తా ఇప్పుడు మూడు జిల్లాలు అయిపోయింది అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ, తమిళనాడు ప్రజల్లో ఉన్న ప్రాంతీయ అస్తిత్వ భావనను ఆయన అభినందించారు. తెలంగాణ ప్రజలను చూస్తే ముచ్చట వేస్తుంది, అక్కడ బలమైన తెలంగాణ భావన ఉంది, తమిళులకు తమిళ భావన ఉంది. కానీ ఏపీ వాళ్లకు మాత్రం ఇంకా సబ్-రీజియన్స్ ఉన్నాయి. ఆంధ్ర అనే ఒకే ఒక్క భావన అందరిలో ఉంటే మంచిది. అని ఏపీ ప్రజల్లో ప్రాంతీయ ఐక్యత రావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

### కుల దూషణల రాజకీయాలకు చరమాంకం

గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ వ్యవస్థ ఎంతగా దిగజారిందో పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక చివరికి జర్నలిస్టుల్లో కూడా కులాలతో తిట్టడం, వర్గాలుగా విడిపోవడం మొదలైంది. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, అసలు ఇష్యూస్ డైవర్ట్ చేయడానికి కుల దూషణలకు దిగడం అలవాటుగా మార్చుకున్నారు అని విమర్శించారు. సమాజంలో విషం చిమ్ముతున్న ఇలాంటి కుల, ప్రాంతీయ రాజకీయాల అన్నింటికీ చరమాంకం పలకాలని జనసేన గట్టిగా భావిస్తోందని, రెండు రాష్ట్రాల ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## డీఎస్సీ 2025పై సీబీఐ విచారణ చేయాలి

అదనపు పోస్టులు ఇస్తామని జగన్ ప్రకటించారు.వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే లక్షా 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్న జగన్ ఆ రోజు ఎలాంటి వివాదాలు రాలేదని, అంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామన్నారు. చంద్రబాబు కేవలం16 వేల ఉద్యోగాల్లో ఇన్ని అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. డీఎస్సీ అభ్యర్థుల తరుపున వారికి ఖర్చులేకుండా తామే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా పేరుతో తొలుత ఒక జీవో ఇచ్చి పరీక్ష లేకుండా కేవలం సర్టిఫికేట్ల ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చుకున్నారన్న జగన్ ఆ తర్వాత మరో జీవో ఇచ్చి పరీక్షలు రాయాలని చెప్పారన్నారు. డీఎస్సీ నిర్వహణలో పారదర్శకత లేదన్న ఆయన వైసీపీ ప్రభుత్వం రాగానే ఈ అక్రమాలపై విచారణ జరిపిస్తామన్నారు.పరీక్షకు ముందే పేపర్లు లీక్ చేయడం, ఆ తర్వాత ఇష్టానుసారం జీవోలు ఇవ్వటం, 1:1 పద్ధతిలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసి, అన్నీ కరెక్టుగా ఉన్నా ఉద్యోగాలు ఇవ్వకపోవడం, మెరిట్ వాళ్లను కాకుండా కింద ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడం, వాటిపై ప్రశ్నిస్తే స్పష్టమైన సమాధానాలు చెప్పకపోవడం జరిగాయని జగన్ ఆరోపించారు. అర్హులైన అభ్యర్థుల తరుపున వైసీపీ నిలబడుతుందన్న జగన్ తాము అధికారంలోకి వచ్చాక అవసరమైతే వారికి అదనపు పోస్టులు ఇస్తామన్నారు. 1998 డీఎస్సీలో అన్యాయమైనవారికి న్యాయం చేసిన తరహాలోనే 2025 డీఎస్సీ అభ్యర్థులకు కూడా న్యాయం చేస్తామని జగన్ హామీ ఇచ్చారు.

## భూముల ధరల సవరణకుసర్కార్ గ్రీన్ సిగ్నల్

హెచ్చుతగ్గులున్న ధరలను క్రమబద్ధీకరించాలని క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం మేరకు అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక నిపుణుడు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక, ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని విస్తృత స్థాయి అధ్యయనం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ప్రాంతాల వారీగా మార్కెట్ పరిస్థితులు, ధరలు, ప్రభుత్వ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమగ్రంగా పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో కొత్త విలువలను నిర్ణయించామని మంత్రి పేర్కొన్నారు. మార్కెట్ వాస్తవ ధరలకు, ప్రభుత్వ విలువలకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటం వల్ల భూ లావాదేవీలలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. గ్రామీణ, పట్టణాల్లో స్థానిక పరిస్థితులను పరిశీలించి భూ విలువలను సవరించామని చెప్పారు.ప్రాంతాల అభివృద్ధి సామర్థ్యం, వృద్ధి రేటు, ఇటీవల జరిగిన భూముల వేలం, మార్కెట్ పరిస్థితులు, డిమాండ్, కొత్త రహదారులు, కారిడార్లు, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్కెట్ విలువలను నిర్ణయించినట్లు వివరించారు. అలాగే, ఫ్లాట్ల అన్ని అంతస్తులకు ఒకే రేటు వర్తింపజేస్తూ మార్కెట్ విలువలను హేతుబద్ధీకరించినట్లు వివరించారు. ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదించలేదని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రాంతాల అభివృద్ధి స్థాయిని బట్టి వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కనీస ప్రాథమిక ధరలను కూడా నిర్ణయించినట్లు తెలిపారు.గత ఐదేళ్లలో నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో నిర్మాణ ధరలను సవరించినట్లు మంత్రి పేర్కొన్నారు. పలు మున్సిపాలిటీలు కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ కావడం, గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాల ధరలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించినట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఈ సవరణలు చేపట్టామని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, భూ లావాదేవీలలో పారదర్శకతకు, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్ని ప్రమాదం

హౌజ్‌రానీలోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఉదయం 8.50 గంటల సమయంలో బేస్‌మెంట్‌లో తొలుత మంటలు చెలరేగి పైఅంతస్తులకు వ్యాపించాయి. ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెండు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపుచేస్తూ.. లోపలి చిక్కుకున్నవారిని రక్షించేందుకు ప్రయత్నించారు. గాయపడినవారిని చికిత్సకోసం సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రత్యక్ష సాక్షి ఒకరు మాట్లాడుతూ ముందుగా చిన్నగా మొదలైన మంటలు వేగంగా పైకి వ్యాపించాయని, దీంతో లోపల చిక్కుకున్నవారు బయటకు వచ్చే మార్గం లేకుండా పోయిందన్నారు.కిటికీల నుంచి పలువురు కిందికి దూకారని, వారికి ఎలాంటి దెబ్బలు తగలకుండా స్థానికులు పరుపులను కిందవేశారని చెప్పారు. ఒక మహిళ చిన్నారితో సహా మూడో అంతస్తు నుంచి కిందికి దూకిందని వివరించారు. ఉదయం ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయడానికి ప్రయత్నించిన సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని, వెంటనే మిగతా సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు ఆ రెస్టారెంట్ చెఫ్ కేసర్ సింగ్ తెలిపారు. బయటకు వచ్చిచూసేసరికి భవనం మొత్తం మంటల్లో చిక్కుకుందని పేర్కొన్నాడు. ఈ హోటల్‌లో బసచేసినవారిలో ఎక్కువ మంది సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం వచ్చినవారేనని అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగే సమయానికి బాధితులు నిద్రలో ఉండటం వల్ల ప్రాణనష్టం అధికంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ప్రాణాలు కాపాడుకోడానికి పలువురు భవనంపై నుంచి దూకుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉండగా ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన అధికారులు ప్రమాదానికి గల కారణాలను ఆరా తీస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయనేది ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. ఫ్లోరిష్ స్టేకు ఢిల్లీ ప్రభుత్వం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ కాన్సెప్ట్ కింద లైసెన్స్ మంజూరు చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, కేవలం ఆరు గదులకు మాత్రమే అనుమతి ఉంది. కానీ, బేస్‌మెంట్‌లోని గదులు సహా ఆ హోటల్ 25 గదులను నిర్వహిస్తున్నట్లు సమాచారం. హోటల్ అగ్నిమాపక శాఖ నుంచి సేఫ్టీ సర్టిఫికెట్ పొందిందా లేదా అనేది అధికారులు ధ్రువీకరించనున్నారు. అంతేకాకుండా, ఆ హోటల్‌కు ఎంట్రీ, ఎగ్జిట్‌కు ఒకటే మార్గం ఉందని, దీనివల్ల ప్రమాద తీవ్రత ఎక్కువైందని అన్నారు.

## కోటి మందితో యోగాంధ్ర-2026

వంతెనపై 25 వేల మందితో నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మందితో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో పాటు ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి 56 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి 'యోగా-టూరిజం'ను ప్రోత్సహిస్తామన్నారు. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను, 2.50 లక్షల మంది ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సలహాలు, సేవలు తీసుకుంటున్నామని, ఆయన రూపొందించిన 168కి పైగా వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 81424 04888 వాట్సాప్ నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా యోగాంధ్ర పోర్టల్‌ను ప్రారంభించామని, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటున్నట్లు సీఎం వెల్లడించారు. గతేడాది యోగాంధ్ర కార్యక్రమానికి 2.44 కోట్ల మంది నమోదు చేసుకున్న స్ఫూర్తితో ఈసారి కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసి, యోగాను 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

## సీపీఆర్ చేసి నిండు ప్రాణాన్ని కాపాడిన కోర్టు కానిస్టేబుల్ భాస్కర్



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లా కోర్టు ఆవరణలో గుండె నొప్పితో కుప్పకూలిని వ్యక్తికి సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కొనరావుపేట కోర్టు కానిస్టేబుల్ భాస్కర్.కోర్టు కానిస్టేబుల్ భాస్కర్ ని అభినందించిన ఎస్పీ మహేష్ బి. గితే. జిల్లా కోర్టు ఆవరణలో ఇల్లంతాకుంట మండలం కట్కూరు గ్రామానికి చెందిన వెంకటేశం కోర్టు కి హాజరు కాగా అకస్మాత్తుగా గుండె నొప్పితో కుప్పకులగా అక్కడే ఉన్న కొనరావుపేట పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ భాస్కర్ సకాలంలో స్పందించి సీపీఆర్ చేయడంతో బాధితుడు స్పృహలోకి రావడంతో పాటు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.కానిస్టేబుల్స్ చాకచక్యంగా వ్యవహరించడంతో వెంకటేశం ప్రాణాలతో బయటపడ్డారు. సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ లను నెటిజన్లు అభినందిస్తున్నారు.హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి తక్షణం సాయపడేలా పోలీసులకు ఉన్నతాధికారులు ఇప్పించిన సీపీఆర్ శిక్షణ ఓ నిండు ప్రాణం నిలబెట్టింది.

# 9 జిల్లాల్లో మహిళా శక్తి బజార్లు

**ఖమ్మం,** తెలంగాణలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా మహిళా సూపర్ బజార్లు, లాజిస్టిక్స్ హబ్‌లు, ఆధునిక రైస్‌మిల్లులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ వేగంగా అడుగులు వేస్తోంది. మహిళా సంఘాల ద్వారానే వీటిని సమర్థవంతంగా నిర్వహించి, వారిని వ్యాపారవేత్తలుగా మార్చాలనేది ప్రభుత్వ ప్రధాన సంకల్పంఈ బృహత్తర ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో వేగవంతం చేసేందుకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ సోమవారం రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తొలి దశ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఒకేసారి కాకుండా.. ప్రాథమికంగా తొమ్మిది ఉమ్మడి జిల్లా కేంద్రాలైన హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, సంగారెడ్డిలలో ఒక్కొక్కటి చొప్పున మహిళా శక్తి సూపర్ బజార్లను స్థాపించాలని ప్రతిపాదించారు. ప్రముఖ రిటైల్ సంస్థ డీమార్ట్ తరహాలోనే ఈ సూపర్ బజార్లలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యావసర సరకులు, గృహోపకరణాలు, వివిధ రకాల పరికరాలను తక్కువ ధరలకే విక్రయించేలా ఖమ్మంలో మొదటి పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారుఈ సూపర్ బజార్ల నిర్మాణానికి జనాభా సాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సుమారు 5 వేల గజాల స్థలం అవసరమని సెర్ప్ అధికారులు గుర్తించారు. అనువైన ప్రభుత్వ భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ఆయా జిల్లాల కలెక్టర్లకు తక్షణమే లేఖలు రాయాలని నిర్ణయించారు. మరోవైపు.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో లాజిస్టిక్స్ హబ్, రైస్‌మిల్లు ఏర్పాటుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని, ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఖమ్మం జిల్లాలో భారీ గోదాం, లాజిస్టిక్స్ హబ్, రైస్ మిల్లుల స్థాపన కోసం దాదాపు 20 ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ప్రతిపాదనలు పంపేందుకు సెర్ప్ సిద్ధమైంది. ఈ మెగా ప్రాజెక్టుల విజయవంతమైన నిర్వహణకు గానూ.. ఆయా జిల్లాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్న మహిళా సమాఖ్యలను ఎంపిక చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు సెర్ప్ ఆదేశాలు జారీ చేసింది. ఖమ్మంలో నిర్మించబోయే లాజిస్టిక్స్ హబ్, రైస్ మిల్లులకు సంబంధించి ఏ మండలంలో అయితే భూమిని ఎంపిక చేస్తారో అదే మండలానికి చెందిన మహిళా సమాఖ్యకే పూర్తి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తరహా ప్రాజెక్టులు రానున్నందున.. రాష్ట్రంలోని అన్ని మహిళా సమాఖ్యలు ఆర్థిక నిర్వహణకు, వ్యాపార బాధ్యతలకు సిద్ధంగా ఉండాలని సెర్ప్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో తెలంగాణ మహిళా లోకంలో సరికొత్త ఉపాధి విప్లవం రానుంది

## మహానగరంలో ఉండేది ఎలా

# ఆకాశన్నంటుతున్న అద్దెలు



**హైదరాబాద్,** మహానగరంలో సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సొంతిల్లు కొనడం ఒక కలగానే మిగిలిపోతుండగా, కనీసం అద్దె ఇంట్లోనైనా ఉందామన్నా కిరాయిలు ఆకాశాన్ని తాకుతున్నాయి. నగరంలో ప్రతి సంవత్సరం విపరీతంగా పెరుగుతున్న అద్దెల కారణంగా మధ్యతరగతి కుటుంబాలపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. సాధారణంగా వేసవి సెలవుల సమయంలో ఇళ్లు ఎక్కువగా ఖాళీ అవుతుంటాయి. ఆ తర్వాత జూన్ నెల వచ్చేసరికి ఉద్యోగుల బదిలీలు, పిల్లలను కొత్త స్కూళ్లు, కాలేజీలలో చేర్పించడం, అలాగే ఉపాధి కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి వచ్చేవారి వలసల కారణంగా అద్దె ఇళ్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలోనే మణికొండ వంటి ప్రాంతాల్లో 'టులెట్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. నగరంలో భారీ అద్దెలను భరించలేక చాలామంది ప్రజలు శివార్లకు వెళ్లిపోతున్నారు. ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే ఐటీ కారిడార్ పరిధిలో ఇళ్ల అద్దెలు మరీ ఎక్కువగా ఉన్నాయి. మణికొండ పంచవటి కాలనీలో ఒక 3 ఃఊఐ ఫ్లాట్ అద్దె నెలకు రూ. 40,000 నుండి రూ. 50,000 మధ్య పలుకుతుండగా, 2 ఃఊఐ ఫ్లాట్‌కు రూ. 25,000 నుండి రూ. 30,000 వరకు డిమాండ్ చేస్తున్నారు. వీకర్ సెక్షన్ ఏరియాల్లో సైతం అద్దెలు రూ. 18,000 నుండి రూ. 20,000 కు చేరాయి. బాచుపల్లిలోని కొత్త ఫ్లాట్లలో 2 ఃఊఐ కిరాయి రూ. 20,000 వరకు ఉండగా, కిస్మత్‌పూర్‌లో రూ.25,000 గా ఉంది. కేపీహెచ్‌బీ పాత ఫ్లాట్లలో సైతం రూ. 20,000 నుండి రూ. 25,000 వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తెల్లాపూర్, నల్లగండ్ల, గండిపేట వంటి ఐటీ ప్రాంతాలలోని గేటెడ్ కమ్యూనిటీలలో అద్దెలు మరింత దారుణంగా ఉన్నాయి. అక్కడ 2 ఃఊఐ కి రూ. 40,000 ? రూ. 50,000, అలాగే 3 ఃఊఐ కి రూ. 60,000 నుండి రూ. 80,000 వరకు రెంట్ వసూలు చేస్తున్నారు. విల్లాల అద్దెలైతే ఏకంగా రూ. 1 లక్ష నుండి రూ. 2 లక్షల వరకు పలుకుతున్నాయి. వీటికి అదనంగా మెయింటెనెన్స్ చార్జీల కింద రూ. 2,000 నుండి రూ. 6,000 వరకు, అలాగే కరెంట్, వాటర్ బిల్లులు అదనం.

### సర్దుకుపోతున్న జనం..

నగరంలో అద్దె ఇళ్లపై ఆధారపడిన వారి పరిస్థితిని జనగణన ప్రాథమిక డేటా స్పష్టం చేస్తోంది. నగరంలోని 65 శాతం కుటుంబాలకు అద్దె ఇళ్లే ఆధారం. వీరిలో 50 శాతం కుటుంబాలకు ఈ ఇళ్ల అద్దెలు తీవ్ర ఆర్థిక భారంగా మారాయి. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లలో అద్దెలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి.

భూముల ధరలు విపరీతంగా పెరగడం వల్లే ఇళ్ల నిర్మాణ వ్యయం పెరిగి, ఆ ప్రభావం అద్దెలపై పడుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం కనీసం రూ. కోటి పెడితే గానీ నగరంలో సౌకర్యవంతమైన ఇల్లు కొనే పరిస్థితి లేదు. తాము కట్టే అద్దెలు కనీసం హోమ్ లోన్ ఈఎంఐకి సరిపోవాలని కొందరు యజమానులు ఆశిస్తున్నారు.

అద్దెలు భరించలేక జనం శివార్లకు వెళ్తున్న నేపథ్యంలో, ప్రభుత్వం ప్రజా రవాణా సౌకర్యాలను పెంచాలని, మెట్రోను విస్తరించాలని తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.వి. రావు అభిప్రాయపడ్డారు. మరోవైపు భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ, లక్షల్లో జీతాలు వచ్చే వారికి అద్దె పెద్ద సమస్య కాకపోయినా, రూ. 50,000 లోపు వేతనం వచ్చే వారు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల ఫీజులు, కుటుంబ ఆరోగ్యం కోసమే సగం జీతం ఖర్చవుతుండటంతో, సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు లేదా శివార్లలో రూ. 10,000 లోపు దొరికే ఇళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఐటీ కారిడార్‌లో పనిచేసే ఒక ఉద్యోగి తన బడ్జెట్ పరిమితుల వల్ల ఈసీఐఎల్ నుండి రాకపోకలు సాగిస్తుండగా, కేవలం ట్రాఫిక్ కారణంగానే రోజూ 4 గంటల సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు

## నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా తిలకించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి బృందం.

**బుధవారం** నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. భరత్ లతో పాటు సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించడం గౌరవంగా భావిస్తున్నామని అన్నారు.

పాలన, ప్రజా విధానాలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై జరిగిన ఫలవంతమైన ఆలోచనల మార్పిడి విలువైన అవగాహనను అందించడమే కాకుండా, పరస్పర అవగాహనను మరింత బలోపేతం చేసిందని, ఒకరినొకరు అనుభవాల గురించి నేర్చుకుంటూ, భవిష్యత్తులో మరింత బలమైన ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించేందుకు ఎదురుచూస్తున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# ట్రాఫిక్ చలాన్లపై బిగ్ అప్‌డేట్..

## – నెల రోజులే గడువు, త్వరపడండి

**హైదరాబాద్,** ట్రాఫిక్ చలాన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాహనదారులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని తేల్చి చెప్పింది. ఇందుకోసం నెల రోజుల గడువు ఇచ్చింది. నెల రోజుల తర్వాత వివరాలు నమోదు చేసుకోకపోయినా.. ట్రాఫిక్ చలాన్ పంపించినట్లుగానే భావిస్తామని స్పష్టం చేసింది. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత కఠిన వైఖరి అనుసరించడంలో భాగంగా సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. రోడ్లపై ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వాహనదారులపై పోలీసులు చలాన్‌లు విధించి.. వారిపై కొరఢా ఝుళిపిస్తూ ఉంటారు. అయితే కొంతమంది వాహనదారులపై అనేక ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నా.. పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతూ ఉంటారు. ఈ క్రమంలోనే కొందరు వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు దొరికినప్పుడు వారి బండి నంబర్ ఆధారంగా చెక్ చేస్తే.. వేలల్లో ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉండటం మనం చూస్తూనే ఉన్నాం. చాలా మంది పోలీసులకు చిక్కకుండా.. ట్రాఫిక్ చలాన్లను కట్టకుండా.. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తూ.. ఫైన్లు కొండలా పేరుకుపోయే వరకు ప్రయాణిస్తూ ఉంటారు. అయితే ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే తెలంగాణలోని వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఇక నుంచి ట్రాఫిక్ చలాన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పక్కాగా ఓనర్లకు చేరేలా తెలంగాణ రవాణా శాఖ సరికొత్త నిబంధనను అమలులోకి తీసుకొచ్చింది. ట్రాఫిక్ చలాన్లకు సంబంధించిన అలర్ట్స్‌ను ఎప్పటికప్పుడు పొందేందుకు ప్రతీ ఒక్కరూ తమ వివరాలను వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కొత్త నిబంధనల ప్రకారం.. ప్రతీ ఒక్క వాహనదారుడు తమ మొబైల్ నంబర్, వాట్సాప్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ వంటి వివరాలను నెల రోజుల్లోగా కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ అయిన వాహన్ లో తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ప్రభుత్వం ఇచ్చిన నెల రోజుల గడువు ముగిసిన తర్వాత.. వాహన్ పోర్టల్‌లో నమోదై ఉన్న సెల్ నంబరు, ఈ-మెయిల్‌కు ఎస్ఎంఎస్, వాట్సాప్, మెయిల్ ద్వారా ట్రాఫిక్ చలాన్లను సంబంధిత వాహన యజమానికి పంపిస్తారు. ఇలా పంపిన ట్రాఫిక్ చలాన్లు.. వారికి అందినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఇంతకుముందు లాగా.. తమ ఫోన్‌కు ట్రాఫిక్ చలాన్ రాలేదని.. దానికి సంబంధించి మెసేజ్ కూడా రాలేదని.. అసలు తమ బండిపై ట్రాఫిక్ చలాన్ ఉందనే సమాచారం కూడా తమకు తెలియదని వాహనదారులు చలాన్లు తప్పించుకోవడానికి వీలు ఉండదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గతంలో ఇలాంటి సాకులు చెప్పి.. కొందరు వాహనదారులు ట్రాఫిక్ చలాన్లు కట్టకుండా తప్పించుకునే వారని తెలిపాయి. పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్ల వసూళ్లను మరింత వేగంగా వసూలు చేయడానికి.. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత పారదర్శకతను పెంచడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## భారీ ఫ్లైఓవర్ కోసం సర్కార్ గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్,** హైదరాబాద్‌లో మరో భారీ ఫ్లైఓవర్ నిర్మించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌బీ నగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో.. ఇప్పటికే చాలా ఫ్లైఓవర్లు నిర్మించగా.. తాజాగా మరొకటి నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.416 కోట్లను కూడా కేటాయించింది. త్వరలోనే ఈ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూసేకరణ పనులు చేపట్టేందుకు అధికారులు రెడీ అయ్యారు. విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లను గుర్తించి.. అక్కడ భారీ ఫ్లైఓవర్లను నిర్మిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా నగరంలో మరో ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్లతో 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్ నగరంలోని తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. టీకేఆర్ కాలేజీ, గాయత్రీనగర్, మందమల్లమ్మ జంక్షన్ల మీదుగా నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్ వల్ల ఎయిర్‌పోర్టు మార్గంలో ట్రాఫిక్ తగ్గనుంది. అంతేకాకుండా మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం లభించనుండగా.. ఎల్‌బీ నగర్ నుంచి పాతబస్తీ వైపు ప్రయాణం కూడా మరింత సులభతరం కానుంది. త్వరలోనే భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ పనులు ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్ల వ్యయంతో ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. టీకేఆర్ కాలేజీ జంక్షన్, గాయత్రీనగర్ జంక్షన్, మందమల్లమ్మ జంక్షన్‌ల మీదుగా ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు కింద ఈ పనులను ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) టర్న్‌కీ విధానంలో కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ చేపట్టనుంది. ఎల్బీ నగర్ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం ఈ 3 జంక్షన్ల వద్ద తీవ్రంగా ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. మరీ ముఖ్యంగా గత 10 ఏళ్లలో మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ వంటి ప్రాంతాల్లో జనాభా గణనీయంగా పెరగడంతో పాటు.. వాహనాల రాకపోకలు కూడా భారీగా పెరిగాయి. దీంతో ఈ ప్రాంతాల నుంచి నగరానికి వెళ్లే ప్రయాణికులతో నిత్యం ఆ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి అయితే నగర తూర్పు భాగాన్ని విస్తరించిన దక్షిణ ప్రాంతాలతో అనుసంధానం చేయడంలో కీలక పాత్ర పోషించనుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాల ప్రజలకు వేగవంతమైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయని చెబుతున్నాయి. అలాగే ఎల్‌బీ నగర్ జంక్షన్ నుంచి సంతోష్‌నగర్ మీదుగా పాతబస్తీ వైపు వెళ్లే ప్రయాణికులకు కూడా ప్రయాణ సమయం భారీగా తగ్గే అవకాశం ఉందని వెల్లడిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఫ్లైఓవర్‌కు సంబంధించి.. త్వరలోనే భూసేకరణ, విద్యుత్ లైన్లు, నీటి పైపులు వంటి యుటిలిటీ షిఫ్టింగ్ పనులను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే నగర తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

### భూ తగాదాల్లో సెటిల్‌మెంట్లు చేసేవారికి

# "కౌన్సిలింగ్" ఇవ్వండి

### – వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్.



భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వం వహిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్లకు "కౌన్సిలింగ్" నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కెయూసి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఏసిపి నర్సింహరావు, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికాలికారు. పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, స్టోర్, కేసు ప్రాపర్టీగదులు, స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా వున్న రౌడీ షీటర్లు, అనుమానితులు ఎవరు, ప్రస్తుతం వాళ్ళు ఎలావున్నారు..ఏం చేస్తున్నారు మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చే రౌడీ షీటర్లతో పాటు బెదిరింపులకు పాల్పడే వారికి ప్రత్యేక "కౌన్సిలింగ్" ఇవ్వాలని, రౌడీ షీటర్లపట్ల సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, యాక్టివ్‌గా వున్న రౌడీపై నజర్ పెట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ముఖ్యంగా స్థానికంగా వున్న సామాజిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేషన్ ఎస్.ఐలు అప్పగించిన సెక్టార్ పరిధిలో నేరాల నియంత్రించడంతో పాటు, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో ఎస్.ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమర్, రాజమౌళి పాల్గొన్నారు.

# పోలీసు కస్టడిలో సుబోధ్ సింగ్

**కరీంనగర్ ...** మోస్ట్ వాంటెడ్ దొంగ సుబోధ్ సింగ్ ను పోలీసులు కస్టడిలోకి తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన పీఎంజే జెవెల్లర్స్ దోపిడీ కేసులో సుబోధ్ సింగ్ ప్రధాన సూత్రధారి. నిందితుడిని పోలీసులు బీహార్ పాట్నా జైలు నుండి పిటి వారెంట్ పై కరీంనగర్ తీసుకువచ్చారు. సుబోధ్ సింగ్ తో పాటుగా మరో ముగ్గురు దొంగలను కస్టడీ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జైలు వద్ద భారీ పోలీస్ భద్రత కల్పించారు.

### హరీశ్ రావు జన్మదినోత్సవం సందర్భంగా

# పాటల సీడీ ఆవిష్కరణ

**సంగారెడ్డి** బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని యువ నాయకుడు వికాస్ రూపొందించిన ప్రత్యేక పాటల సీడీని మాజీ మంత్రి హరీశ్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, హరీశ్ రావు నాయకత్వం తెలంగాణ రాష్ట్రానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో హరీశ్ రావు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, నిబద్ధత రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర నిర్మాణం వరకు హరీశ్ రావు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకుడిగా హరీశ్ రావు ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు.

## పోలీసులకు చిక్కిన క్రికెట్ బుకీ గోల్డ్ శేఖర్

**పల్నాడు జిల్లా** నకిలీ ట్రేడింగ్ కంపెనీ పేరిట మోసాలకు పాల్పడుతున్న ప్రముఖ క్రికెట్ బుకీ కందుకూరి వీరశేఖరాచారి అలియాస్ 'గోల్డ్ శేఖర్' ను పల్నాడు జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహానందిలోని ఒక లాడ్జిలో తలదాచుకున్న అతడిని, అతని భార్యను పోలీసులు అరెస్టు చేశారుసాధారణ గోల్డ్ అప్రైజర్‌గా ప్రారంభమైన గోల్డ్ శేఖర్, తర్వాత క్రికెట్ బుకీ అవతారం ఎత్తి కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించినట్లు పోలీసులు వెల్లడించారు. క్రికెట్ బెట్టింగ్‌లు, ట్రేడింగ్ పేరుతో మోసాలు చేస్తూ భారీ స్థాయిలో డబ్బులు సంపాదించినట్లు విచారణలో బయటపడింది. గోల్డ్ శేఖర్‌పై ఇప్పటికే పలు క్రికెట్ బెట్టింగ్ కేసులు, పోక్సో, ఎన్‌డీపీఎస్ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. తాజాగా రూ.1.44 కోట్ల మోసం కేసులో కీలక నిందితుడిగా అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు వెల్లడించారు. ఇంకా ఈ కేసులో మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేస్తామని టూ టౌన్ పోలీసులు స్పష్టం చేశారు.

## కాకరపాడు హెచ్‌పీ బంకు అంశంపై హెచ్‌పీసీఎల్ అధికారి యామిని ప్రియా స్పష్టత

**కొయ్యూరు** కాకరపాడు హెచ్‌పీ పెట్రోల్ బంకుకు సంబంధించి వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ అధికారి యామిని ప్రియా స్పందించారు. పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధమని, అలా జరిగితే సంబంధిత బంకుపై చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే బంక్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ లేదా నోటీస్ బోర్డులో ఉన్న అధికారిక సంప్రదింపు నంబర్లకు ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. వినియోగదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు హెచ్‌పీసీఎల్ పర్యవేక్షణ వ్యవస్థ అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు డీజిల్‌ను డబ్బాల్లో తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంటే బంక్ మేనేజర్‌తో ముందుగా మాట్లాడి అవసరమైన అనుమతులు తీసుకుని, నిర్దిష్ట పరిమితి మేరకు మాత్రమే ఇంధనం తీసుకెళ్లే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ ప్రక్రియలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు మళ్లీ కొనసాగితే సంబంధిత బంక్‌పై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, అవసరమైతే సేల్స్‌ను నిలిపివేసే అవకాశం కూడా ఉంటుందని హెచ్‌పీసీఎల్ అధికారి యామిని ప్రియా తెలిపారు. ప్రజల నుంచి ఇలాంటి ఫిర్యాదులు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. ఈ అంశంపై ఐటీడీఏ అధికారుల దృష్టికి కూడా విషయం తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. ఇకపై ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ మరింత కఠినతరం చేస్తామని హెచ్‌పీసీఎల్ అధికారి యామిని ప్రియా తెలిపారు.

# పులి దాడిలో లేగదూడలు మృతి.



**దేవిపట్నం :** దేవీపట్నం మండలం గంగంపాలెం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున పులి పంజా విసిరింది. పులిదాడిలో 13 దూడలు మృతి చెందాయి. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ప్రధాన కార్యాలయం నుండి ముఖ్య వన్యప్రాణి సంరక్షకులు ఎన్. నాగేశ్వరరావు, రాజమండ్రి ముఖ్య అటవీ సంరక్షకురాలు డాక్టర్ జ్యోతి, రంపచోడవరం డిఎఫ్ఓ ఎన్. రామచంద్ర రావు, రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ టి. శ్రీనివాస రావు, రంపచోడవరం సబ్ డిఎఫ్ఓ టి. అనూష, అడ్డతీగల సబ్ డిఎఫ్ఓ జె.వి. సుబ్బారెడ్డి, ఇందుకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కొండల రావు, ఫోక్స్‌పేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస రావు, 6 ర్యాపిడ్ రెస్క్యూ టీమ్ (ఖీఖీ) బృందాలు, 5 ప్రజా అవగాహన బృందాలు, 4 ట్రాంక్విలైజింగ్ బృందాలు, 2 డ్రోన్ బృందాలు, 1 కేజ్ బృందం, 1 వన్యప్రాణి అంబులెన్స్ బృందం మరియు ఫ్రంట్‌లైన్ సిబ్బందితో కూడిన 19 హనుమాన్ బృందాలు, మొత్తం సుమారు 100 మంది సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిన్న రాత్రి హనుమాన్ బృందాలు సమీపంలోని గ్రామస్తులకు పులి సంచారం గురించి తెలియజేశాయి. పశువులను కోల్పోయిన రైతులకు అటవీ శాఖ వెంటనే నష్టపరిహారం చెల్లిస్తుందని సీనియర్ అటవీ అధికారులు హామీ ఇచ్చారు. ప్రజల రాకపోకలను నియంత్రించడానికి, అటవీ శాఖ పోతవరం-దండంగి రహదారిని దిగ్బంధించి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది.

## తెరనిమ్ బయోలాజిక్స్‌కు భూమి పూజ

సంగారెడ్డి రూ.1200 కోట్ల భారీ పెట్టుబడితో సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం బోర్పట్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న " తెరనిమ్ బయోలాజిక్స్" మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీకి మంత్రి దామోదర్ రాజనర్సింహా తో కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ అత్యాధునిక ఫెసిలిటీలో క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు సంబంధించిన ఔషధాలను ఉత్పత్తి చేసి... యూఎస్ సహా పలు అంతర్జాతీయ దేశాలకు ఎగుమతి చేయనున్నారు. ఈ నూతన ఫెసిలిటీ ద్వారా సుమారు 1500 మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. " తెరనిమ్ బయోలాజిక్స్ " రాకతో లైఫ్ సైన్సెస్ రంగంలో "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ విలువ అంతర్జాతీయ స్థాయిలో మరింత పటిష్ఠం కానుంది.

### రోడ్డు ప్రమాదంలో గొర్ల కాపరితో సహ

# పలు గెర్రెలు మృతి

**నల్గొండ** నల్గొండ జిల్లా డిండి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గొర్ల కాపరితో పాటు వందలాది గొర్రెలు మృత్యువాత పడ్డాయి.. విప్ బీర్ల అయిలయ్యా, ఎమ్మెల్యే బాలు నాయక్, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, గొర్ల మేకల కార్పొరేషన్ల చైర్మన్ సరితా యాదవ్ తదితరులు సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులు పరిశీలించారు.

# షర్మిళకు హ్యాండేనా..



**కడప,** వైఎస్ షర్మిలకు రాజ్యసభ స్థానం దక్కుతుందా? అదీ కర్ణాటక నుంచి. అది సాధ్యమయ్యే పనేనా? కర్ణాటక కాంగ్రెస్ స్థానిక నేతలు ఇందుకు అంగీకరిస్తారా? అన్నది ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలసి వచ్చిన వైఎస్ షర్మిల కొంత ఉత్సాహంతో కనిపించారు. అయితే సమావేశంలో ఏం జరిగిందో తెలియదు కానీ, వైఎస్ షర్మిలకు కర్ణాటక నుంచి రాజ్యసభ పదవి దక్కుతుందని మాత్రం జోరుగా ప్రచారం అయితే జరుగుతుంది. తెలంగాణ ఎన్నికల సందర్భంగా తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడంతో షర్మిలకు రెండు హామీలు లభించాయి. ఒకటి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ గా నియమించడం, రెండోది రాజ్యసభ పదవి ఇవ్వడం. ఈ రెండు హామీలను నెరవేరుస్తామని చెప్పింది.తెలంగాణ వ్యవసాయం ఇందులో ఏపీసీసీ చీఫ్ గా షర్మిలను నియమించారు. ఒక హామీ నెరవేరింది. కానీ రెండేళ్ల నుంచి మరొక హామీ మాత్రం నెరవేరలేదు. ఆ హామీని త్వరలో కర్ణాటకకు ముఖ్యమంత్రి కాబోతున్న డీకే శివకుమార్ ఇవ్వడంతో ఇప్పుడు ఆయనకు రాజకీయంగా ఇబ్బందిగా మారే అవకాశముంది. ఏపీలో కాంగ్రెస్ కు ఒక్కస్థానం కూడా లేకపోవడంతో తెలంగాణ, కర్ణాటకల నుంచి మాత్రమే వైఎస్ షర్మిలకు రాజ్యసభ పదవి ఇవ్వాల్సి ఉంటుంది. తెలంగాణ నుంచి ఇస్తే మళ్లీ సెంటిమెంట్ రాసుకుంటుందని భావించి కర్ణాటక నుంచి ఇవ్వాలని నిర్ణయించారు కానీ కర్ణాటకలో స్థానిక నేతల నుంచి ఈ ప్రతిపాదనకు వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.డీకే శివకుమార్ కు ఇది బిగ్ టాస్క్ అని చెప్పాలి. ముఖ్యమంత్రి అయిన వెంటనే రాజ్యసభ అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. వైఎస్ షర్మిలను ఎంపిక చేస్తే స్థానిక కాంగ్రెస్ నేతల నుంచి డీకేకు వ్యతిరేకత మామూలుగా ఉండదు. లోకల్స్ కు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఎలా ఇస్తారన్న ప్రశ్న తలెత్తుంది. పైగా జాతీయ స్థాయి నేత అయితే ఓకే. కానీ పొరుగు రాష్ట్రంలోనేతకు ఎలా రాజ్యసభ పదవి ఇస్తారన్న ప్రశ్న ఖచ్చితంగా ఎదురవుతుంది. ఢిల్లీలో హైకమాండ్ ఇచ్చిన గ్యారంటీ కావడంతో అమలు చేస్తారా? లేదా? అన్నది ఇప్పుడు కర్ణాటక కాంగ్రెస్ అగ్రనేతలకు పెద్ద సమస్యగా మారింది. వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు ఇచ్చినందువల్ల ఉపయోగం లేదు. అదే మరో రెండేళ్లలో కర్ణాటక ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ వివాదం ఊపందుకుంటే పార్టీకి ఇబ్బందికరంగా మారుతుందన్న కామెంట్స్ మాత్రం కన్నడ మీడియాలో జోరుగా కనిపిస్తున్నాయి.

## వేలూరు రహదారిపై గాయాలతో

# వ్యక్తి మృతదేహం లభ్యం

**చిలకలూరిపేట** చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామంలో వేలూరు గ్రామం నుండి జాలాది వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఒక వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానిక గ్రామస్తులు గమనించారు. రోడ్డుపై మృతదేహం ఉండటంతో భయాందోళనకు గురైన స్థానికులు, వెంటనే చిలకలూరిపేట రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. దీంతో ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా (హత్య జరిగి ఉండవచ్చనే కోణంలో) పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఎవరు? అసలు అక్కడ ఏం జరిగింది? అనే పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

# ఘోర ప్రమాదం..

## – రెండు బస్సులు ఢీకొని ఏడుగురు మృతి

**సూరత్:** గుజరాత్లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సూరత్ జిల్లా బర్డోలి ప్రాంతంలో రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా.. 10 మందికిపైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి మహారాష్ట్రకు చెందిన బస్సు.. బర్డోలి వద్ద ట్యాంకర్ను తప్పించబోయి అదుపుతప్పి డివైడర్ను దాటి ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొట్టింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో డ్యాన్స్ మాస్టర్

# పండుకు గాయాలు



**విశాఖపట్నం** లొడగలవానిపాలెం హైవేపై అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న రెండు వాహనాలను బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. ఘటనలో డాన్స్ మాస్టర్ పండుకు రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో అందరిని . ఆసుపత్రికి తరలించారు. నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని అనుమానం. పచ్చి కోళ్ల లోడ్తో వెళ్తున్న బొలెరో అదుపుతప్పి ప్రమాదం జరిగింది. పండు బృందం తగరపువలస ఉత్సవాల నుంచి తిరుగు ప్రయాణంలో ఘటన జరిగింది. పోలీసులు ప్రమాదానికి గురైన మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

## దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుండి దూకి

# యువతి ఆత్మహత్య



**హైదరాబాద్** దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్య చేసుకుంది. తమ కూతురు రోజా రమణి(26) కనిపించడంలేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. నాగోల్ ప్రాంతంలో నివసిస్తూ మృతురాలు మెడికవర్ ఆసుపత్రిలో అకౌంటెంట్గా పని చేస్తుంది. లోన్ రికవరీ ఏజెంట్స్ వేదింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల అనుమానం.

## తిరుపతిలో వైసీపీ నేతలకు ముందస్తు నోటీసులు

**తిరుపతి** అలిపిరి వద్ద బలవంతంగా స్ట్రీట్ వ్యాపారులు తోపుడు బండ్లు తొలగించారంటు అలిపిరి – జూపార్క్ రోడ్ లో వీధి వ్యాపారులకు మద్దతుగా వైసీపీ నేత భూమన అభినయ్ రెడ్డి సంఘీభావం తెలిపారు. అధికార పార్టీ నేతల అప్రజాస్వామ్యం చర్యలపై అభినయ్ రెడ్డి నేతృత్వంలో అలిపిరి జూపార్క్ రోడ్ వ్యాపారులకు మద్దతుగా క్షేత్రస్థాయిలో పర్యటనచేయనున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పర్యటన అడ్డుకునేందుకు పోలీస్ 30 యాక్ట్ పేరుతో పోలీసులు ముందస్తు నోటీసులు ఇచచారు. వైసీపీ తిరుపతి టౌన్ అధ్యక్షుడు మల్లం రవి చంద్ర కు నోటీసులు ఇచ్చారు.

# వెండిపై మరిన్ని ఆంక్షలు



**ముంబై,** పెరుగుతున్న దిగుమతులను అరికట్టడానికి, రూపాయిపై ఒత్తిడిని తగ్గించడానికి కేంద్రం వెండి దిగుమతులపై ఆంక్షలను కఠినతరం చేసింది. ఇందులో భాగంగా వెండిని గ్రెయిన్, పొడి రూపాల్లో ఉన్న వెండి దిగుమతిని నిషేధిత జాబితాలోకి చేర్చింది. పొడి, గ్రెయిన్ రూపాల్లో భద్రపరిచే కేటగిరీ కిందకు తీసుకురావడంతో పాటు, దిగుమతిదారులు ముందస్తు ప్రభుత్వ అనుమతి పొందాలని కూడా ఆదేశించింది. వెండి దిగుమతులకు తప్పనిసరిగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ అనుమతి ఉండాలని కేంద్రం తెలిపింది. 99.9 శాతం స్వచ్ఛత గల వెండి ఉన్న గ్రెయిన్, పొడి, ఇతర రూపాల్లోని వండి వస్తువుల దిగుమతిని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.గత నెలలోనే 99.99 శాతం ప్యూరిటీ గల వండి కడ్డీల దిగుమతులను, పాక్షికంగా తయారైన అన్ని రకాల వెండి వస్తువులను నిషేధిత జాబితాలో కేంద్రం చేర్చిన సంగతి తెలిసిందే. అదే సమయంలో పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరల కారణంగా విదేశీ మారకపు నిల్వపై ఒత్తిడిని తగ్గించేందుకు వెండి, బంగారం దిగుమతుల సుంకాన్ని భారీగా పెంచింది. 6 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని రెండింతలకు పైగా పెంచి 15 శాతానికి చేర్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు దేశంలోకి వెండి దిగుమతులు భారీగా పెరుగుతున్న క్రమంలో మరిన్ని ఆంక్షలు విధించింది.వెండి దిగుమతులు భారీగా పెరిగిన నేపథ్యంలో తాజా ఆంక్షలు విధించింది కేంద్రం. ప్రపంచంలోనే వెండిని అత్యధికంగా వినియోగించే దేశంగా భారత్ ఉంది. మార్చి 2026తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వెండి దిగుమతులపై రికార్డు స్థాయిలో 12 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అంతకు ముందు ఏడాది ఈ మొత్తం 4.8 బిలియన్ డాలర్లుగా ఉంది. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం ఏప్రిల్లో వెండి దిగుమతులు గతేడాదితో పోలిస్తే 157 శాతం మేర పెరిగి 411 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.పెరిగిన చమురు ధరల నేపథ్యంలో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని అరికట్టే విస్తృత ప్రయత్నాల్లో భాగంగా విలువైన లోహాల దిగుమతులను నిరుత్సాహపరిచేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. గత నెలలో బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 శాతం నుంచి 15 శాతానికి పెంచింది. అయితే కొత్త నిబంధనలు దిగుమతిదారులకు అనిశ్చితిని సృష్టించవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దేశంలో వెండిని ఆభరణాలు, నాణేలు, కడ్డీలు, అలాగే సౌరశక్తి, ఎలక్ట్రానిక్స్ వంటి పారిశ్రామిక అవసరాల కోసం విస్తృతంగా ఉపయోగిస్తారు. బలమైన పెట్టుబడిదారుల ఆసక్తి కూడా దీనికి తోడైంది. గత సంవత్సరంలో సిల్వర్ ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్లోకి నిధుల ప్రవాహం రికార్డు స్థాయికి చేరుకుంది.

## సీబీఎస్ఈ వివాదం..రంగంలోకి కేంద్రం

**న్యూఢల్లీ,** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ రీవేల్యూషన్ ప్రక్రియలో లోపాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. బోర్డు ఛైర్మన్ రాహుల్ సింగ్, కార్యదర్శి హిమాంశు గుప్తాలనుబదిలీ చేసింది. వారి స్థానంలో కొత్త ఛైర్మన్గా లోఖండే ప్రశాంత్ సీతారామ్, కార్యదర్శిగా వరుణ్ భరద్వాజ్ను నియమించింది. అంతేకాదు,ఈ వివాదంపై విచారణకు కమిటీని నియమించింది. ఛైర్మన్ హోదాలో సీబీఎస్ఈ బోర్డు మొత్తం పనితీరు, పరిపాలన బాధ్యతలను రాహుల్ సింగ్ నిర్వర్తిస్తుండగా.. బోర్డుకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, ఆడిట్, ప్రజా సంబంధాలు వంటి విభాగాలను హిమాంశు చూసుకుంటున్నారు.ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానం అమలు, విద్యార్థులు నుంచి వచ్చిన సమస్యలపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సామర్థ్య నిర్మాణ కమిషన్ ఛైర్పర్సన్ ఎస్. రాధా చౌహాన్ ఈ ఏకసభ్య కమిటీకి అధ్యక్షత వహిస్తారు.

ఈ కమిటీ తన నివేదికను నెలలోగా సిబ్బంది వ్యవహారాలు- శిక్షణ విభాగానికి సమర్పిస్తుంది. మరోవైపు, ఓఎస్ఎం అమలు, విద్యార్థులు నివేదించిన సమస్యలపై కమిటీ సభ్యులకు వివరించడానికి స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ సంజయ్ కుమార్తో పాటు రాహుల్ సింగ్కు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు జారీ చేసింది.జవాబు పత్రాలు తారుమారు కావడం, మూల్యాంకనంలో తప్పులు, తప్పుడు దిశానిర్దేశం, తప్పుడు గ్రేడ్ల కేటాయింపు వంటి అనేక సమస్యలు ఉన్నాయి. స్కాన్ చేసిన కాపీల తమవి కావని కనుగొన్నారు. మూల్యాంకన ప్రక్రియలో సుమారు 20 జవాబు పత్రాల పొంతన లేనివిగా గుర్తించినట్లు సీబీఎస్ఈ అధికారులు అంగీకరించారు. వేదాంత్ అనే విద్యార్థి తన సమాధాన పత్రం కాదని, వేరే ఎవరో రాసిన పేపర్లు తనదాంటో కలిపేశారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయ్యింది. దీంతో దేశవ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు తమకూ ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని వాపోయారు. ఈ వివాదంపై ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# పెట్రోల్, గ్యాస్ కష్టాలు తీరినట్టే...

## – అమల్లోకి వచ్చిన సీఈపీప

**న్యూఢిల్లీ,** అమెరికా ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా భారత్ ఇంధన రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు భారీగా పెరిగి, సరఫరా కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి ఊరట లభించింది.హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచంలోని అత్యధిక చమురు, గ్యాస్ రవాణా జరుగుతుంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల నౌకల రవాణాలో అంతరాయం ఏర్పడటంతో భారత్కు ఇంధన సరఫరా దెబ్బతిన్నది. దీని ప్రభావంతో పెట్రోల్, ఎల్పీజీ ధరలు పెరిగాయి. సరఫరా కొరత ఏర్పడింది. పానిక్ బయింగ్ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత్కు ప్రత్యామ్నాయ మార్గం అవసరమైంది.భారత్?ఒమన్ మధ్య కుదిరిన కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్షిప్ అగ్రిమెంట్ (సీఈపీఏ) 2025, జూన్ నుంచి అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఒమన్లోని ప్రధాన పోర్టులు (సలాలా, దుక్మ్ వంటివి) ద్వారా భారత్కు చమురు, ఎల్ఎన్జీ, ఇతర ఇంధన ఉత్పత్తులు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతాయి. ఒమన్ తీర ప్రాంతం హోర్ముజ్ జలసంధికి వెలుపల ఉండటం ఈ ఒప్పందాన్ని వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనదిగా మార్చింది. ఇది భారత్కు సురక్షితమైన, నమ్మదగిన ఇంధన సరఫరా మార్గాన్ని అందిస్తోందిఒమన్తో ఒప్పందం కారణంగా హోర్ముజ్పై అత్యధిక ఆధారపడటం తగ్గుతుంది. పెట్రోల్, ఎల్పీజీ, డీజిల్ సరఫరా స్థిరంగా ఉంటుంది.

ధరల పెరుగుదల నియంత్రణలో ఉంటుంది. ప్రజల ఆందోళన తగ్గి, సాధారణ సరఫరా పరిస్థితి ఏర్పడుతుంది.ఈ ఒప్పందం కేవలం తాత్కాలిక పరిష్కారం కాదు. దీర్ఘకాలికంగా భారత్ ఇంధన దిగుమతులను వైవిధ్యపరచడంలో, సప్లై చైన్ను బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలుస్తుంది.ప్రస్తుత భూరాజకీయ పరిస్థితులు ఏ సమయంలోనైనా హోర్ముజ్ జలసంధిని ప్రభావితం చేసే అవకాశం ఉంది. అలాంటి సమయంలో ఒమన్ లాంటి స్నేహపూర్వక దేశంతో బలమైన వాణిజ్య ? ఇంధన భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం భారత్ దూరదృష్టి, వ్యూహాత్మక విజ్ఞతను చూపిస్తోంది. ఇది భారత్ ఇంధన భద్రతలో కొత్త అధ్యాయం.

## బాలీవుడ్ డైరక్టర్స్‌ను దాటేస్తున్న

# టాలీవుడ్ డైరక్టర్స్

**హైదరాబాద్,** బాహుబలి సినిమా ఎప్పుడైతే వచ్చిందో అప్పటినుంచి తెలుగు సినిమాల హవా ఇండియా వైడ్ గా కొనసాగుతుంది. ఇప్పటికే మన దర్శకులు భారీ పాపులారిటిని సంపాదించుకున్నారు. ఒకప్పుడు ఇండియాలో స్టార్ డైరెక్టర్లు ఎవరు అంటే బాలీవుడ్ దర్శకుల పేర్లు చెప్పారు. కానీ ఆయా దర్శకులకు ఒక్కొక్కరికి మన ఒక్కొక్క దర్శకుడు చెక్ పెడుతూ వచ్చాడు. ముఖ్యంగా రాజ్ కుమార్ హిరానీ లాంటి స్టార్ డైరెక్టర్ కి వరుస సక్సెస్ లను సాధిస్తూ తనకెదురుగా ఎవరు లేరు అనేంతలా పేరును సంపాదించుకున్నాడు. కానీ అతనికి రాజమౌళి బాహుబలి సినిమాతో చెక్ పెట్టాడు. ఇక బాహుబలి 2 సినిమాతో బాలీవుడ్ దర్శకులందరిని ఒకేసారి పక్కన పెట్టేసిన రాజమౌళి ఇండియాలో నెంబర్ వన్ డైరెక్టర్ గా మారాడు?కమర్షియల్ సినిమాలతో సక్సెస్ ను సాధించే రోహిత్ శెట్టికి సుకుమార్ చెక్ పెట్టాడు. 'పుష్ప 2' సినిమాతో 1850 కోట్లకు పైన కలెక్షన్స్ ను రాబట్టి తెలుగు దర్శకులు కమర్షియల్ సినిమాలు చేస్తే ఎలా ఉంటుందో వాళ్లందరికి చూపించాడు?ఇక బాలీవుడ్ హీరో తోనే అనిమల్ సినిమా చేసి ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా?ఆయన సైతం బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అయిన సంజయ్ లీలా భన్సాలీ కి చెక్ పెట్టాడు? ఇక నాగ్ అశ్విన్ లాంటి దర్శకుడు సైతం ఇండస్ట్రీలో ఉన్న మిగతా దర్శకులందరికి చెక్ పెట్టాడు. ఇలా మన దర్శకుల హవా కొనసాగడమే కాకుండా బాలీవుడ్ దర్శకులను సైతం డామినేట్ చేస్తూ మనవాళ్ళు ముందుకు దూసుకెళ్లడం అనేది నిజంగా ప్రతి ఒక్కరిని ఆనందానికి గురిచేస్తుంది.ఇక అలాంటి దర్శకులు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి మరింత మంది రావాలని బాలీవుడ్ ఇండస్ట్రీ షేక్ అయ్యేలా మనవాళ్లు సినిమా చేయాలని బాలీవుడ్ హీరోలు సైతం మనవాళ్ళతో సినిమాలు చేయడానికి ఇంట్రెస్ట్ చూపించాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారు.ఇక మొత్తానికైతే తెలుగు సినిమా ఇండస్ట్రీ ఇప్పుడు టాప్ పొజిషన్లో కొనసాగడమే కాకుండా ఇండియన్ సినిమా ఇండస్ట్రీ ని శాసించే స్థాయికి వెళ్ళిపోయింది? ఇప్పటికే సల్మాన్ ఖాన్ లాంటి స్టార్ హీరో సైతం మన తెలుగు దర్శకుడైన వంశీ పైడిపల్లి తో సినిమా చేస్తున్నాడు. అమిర్ ఖాన్ సైతం తెలుగు దర్శకుల మీద ఎక్కువగా ఫోకస్ చేస్తున్నాడు. కానీ అతనితో సినిమా చేయడానికి పెద్దగా ఎవరు ఇంట్రెస్ట్ ని చూపించడం లేదు?

# సెంటిమెంటే...ఆయింట్ మెంట్

## – ఆత్మగౌరవ నినాదంతో అడుగులు

**హైదరాబాద్,** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ సెంటిమెంట్ తెరపైకి వస్తోంది. పదేళ్ల రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇప్పుడిప్పుడే పరిపాలన, అభివృద్ధి అంశాలపై చర్చ జరుగుతుందనుకుంటున్న తరుణంలో, మళ్ళీ ఆంధ్ర-తెలంగాణ భావోద్వేగాలను రగిల్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

తెలంగాణలో ప్రస్తుతం సాగుతున్న సెంటిమెంట్ రాజకీయాల వెనుక ప్రధానంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగాలు క్రియాశీలకంగా కనిపిస్తున్నాయి. గతంలో కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాలను తెరపైకి తెచ్చి ప్రజల్లో సెంటిమెంట్ను రగిల్చేందుకు ప్రయత్నించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే, ఇప్పుడు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ టార్గెట్ గా జరుగుతున్న రాజకీయం, పవన్ కూడా తెలంగాణపై దృష్టి సారించడం, మంగళవారం జరిగిన సమావేశం పరిణామాలను ఆయుధంగా చేసుకుని తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో కొత్త ఉద్యమాన్ని లేవనెత్తాలని బీఆర్ఎస్ భావిస్తోంది. తద్వారా కోల్పోయిన రాజకీయ ఉనికిని మళ్ళీ చాటుకోవాలన్నది ఆ పార్టీ వ్యూహం.కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ సెంటిమెంట్ వేడి కనిపిస్తోంది. అనిరుధ్ రెడ్డి, మందుల సామ్యూల్ వంటి నేతలు ఏపీ నేతలను టార్గెట్ చేస్తూ చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ లైన్కు భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వీరు కూడా ప్రాంతీయ నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ప్రాంతీయ సెంటిమెంట్ మళ్ళీ బలపడితే, ఆ సెంటిమెంట్కు పేటెంట్ హక్కు కలిగిన బీఆర్ఎస్కే అంతిమంగా లాభం చేకూరుతుందని రేవంత్ గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఆయన భావోద్వేగాల కంటే బాధ్యతాయుతమైన పరిపాలనకే మొగ్గు చూపుతున్నారు.రేవంత్ రెడ్డికి ఒక స్పష్టమైన అవగాహన ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ను కాదని కాంగ్రెస్ను ఎన్నుకున్నది కేవలం సెంటిమెంట్ కోసం కాదు, మార్పు , పరిపాలన కోసం. ఇప్పుడు మళ్ళీ అదే సెంటిమెంట్ ఉచ్చులో పడితే, కాంగ్రెస్ తన అభివృద్ధి అజెండాను పక్కన పెట్టాల్సి వస్తుంది. పైగా, ఏపీతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలని ఆయన భావిస్తున్నారు. కానీ, తన సొంత పార్టీ నేతలు కొందరు కంట్రోల్ కాకుండా ఏపీపై విమర్శలు చేయడం ఆయనకు తలనొప్పిగా మారింది. రేవంత్ రెడ్డి ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి డ్యూయల్ స్ట్రాటజీ అమలు చేసే అవకాశం ఉంది. ఒకటి, పార్టీ నేతలకు కఠినమైన ఆదేశాలు జారీ చేయడం ద్వారా ఏపీ నేతలపై అనవసర వ్యాఖ్యలు చేయకుండా అడ్డుకోవడం. రెండు, బీఆర్ఎస్ చేస్తున్న సెంటిమెంట్ ప్రచారాన్ని రాజకీయ డైవర్షన్ గా ప్రజల్లోకి తీసుకెళ్లడం. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేయని పనులను ఇప్పుడు సెంటిమెంట్ పేరుతో కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని ఆయన వాదించనున్నారు.పవన్ కళ్యాణ్ ఫ్యాక్టర్ కూడా ఈ సమీకరణాల్లో కీలకం. పవన్ను టార్గెట్ చేయడం ద్వారా సెంటిమెంట్ను పెంచాలని బీఆర్ఎస్ చూస్తుంటే, రేవంత్ మాత్రం దాన్ని కేవలం ఒక పొరుగు రాష్ట్ర నేత పర్యటనగా మాత్రమే పరిగణించాలనే ధోరణిలో ఉన్నారు. తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయాలు అనేవి ఒక డబుల్ ఎడ్జ్ స్వోర్డ్ లాంటివి. రేవంత్ రెడ్డి ఈ సెంటిమెంట్ వేవ్ ను సమర్థవంతంగా అడ్డుకోగలిగితేనే కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది. ఒకవేళ తన పార్టీ నేతలను కంట్రోల్ చేయడంలో విఫలమైతే, అది బీఆర్ఎస్కు ఆక్సిజన్ అందించినట్లు అవుతుంది.

## గ్రామాల్లో ఇంటర్ నెట్ స్పీడ్ కోసం

# నయా కార్పొరేషన్

**హైదరాబాద్** తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తెలంగాణ రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ అమెండెడ్ భారత్ నెట్ పథకం కింద కేంద్ర, రాష్ట్రాల సమాన భాగస్వామ్యంతో ఇది పనిచేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు కేంద్రం కార్పొరేషన్ నిర్వహణ కోసం పదేళ్లకు రూ.2600 కోట్లు అలాగే తొలి విడతగా 3 లక్షల గ్రామీణ కనెక్షన్ల కోసం రూ.300 కోట్లు మంజూరు చేసింది.తెలంగాణలోని పల్లెపల్లెకూ హైస్పీడ్ డిజిటల్ నెట్వర్క్ను అనుసంధానం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విప్లవానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమెండెడ్ భారత్ నెట్ పథకంలో భాగంగా.. తెలంగాణ రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఖీఎఎఅఒ)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

కేంద్ర టెలీకమ్యూనికేషన్ల శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో ఈ నూతన సంస్థ పనిచేయనుంది.ఈ కొత్త కార్పొరేషన్ బోర్డులో ఇరుపక్షాలకూ సమాన ప్రాధాన్యత కల్పించారు. బోర్డు సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక సీఈవోతో పాటు ఐటీ, ఆర్థిక, పంచాయతీరాజ్, ఇంధన శాఖల ఉన్నతాధికారులు నలుగురు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తరఫున ఎక్స్ అఫీషియో ఛైర్మన్తో పాటు మరో నలుగురు డైరెక్టర్లు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో సేవలందిస్తున్న తెలంగాణ ఫైబర్గ్రిడ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ కొత్త కార్పొరేషన్కు కూడా సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారుతెలంగాణకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా కొత్త కార్పొరేషన్ ఏర్పాటు నిబంధనల్లో కొన్ని కీలక వెసులుబాట్లు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి భారీ నిధులను ఆమోదించింది. కార్పొరేషన్ నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఇతర సాంకేతిక అవసరాల కోసం ఏటా రూ.260 కోట్ల చొప్పున.. రాబోయే పదేళ్ల కాలానికి గానూ మొత్తం రూ.2600 కోట్ల భారీ నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.దీంతో పాటు భారత్ నెట్ ఉద్యమి ప్రోగామ్ కింద తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని మరింత వేగవంతం చేసేందుకు కేంద్రం ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా తొలి విడతలోనే రాష్ట్రంలోని పల్లెటూళ్లలో 3 లక్షల గృహాలకు ఉచిత ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఒక్కో కనెక్షన్‌కు రూ.10వేల చొప్పున మొత్తం రూ.300 కోట్లను కేంద్రం భరించనుంది. గతంలో నిర్మించిన భారత్ నెట్ ఫేజ్-1, 2 నెట్‌వర్క్‌లను అత్యాధునికంగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఇప్పటివరకు కనెక్టివిటీ లేని మారుమూల గ్రామాలకు ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఉన్న టీ-ఫైబర్ జిల్లా, మండల కేంద్రాల వరకే నెట్‌వర్క్‌ను నిర్వహిస్తుండగా.. కొత్తగా ఏర్పాటైన టీఆర్ఐఐసీఎల్ మండల కేంద్రాల నుండి చివరి గ్రామ స్థాయి వరకు ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లి దాని నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించనుంది.

## మున్సిపల్ నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎన్ సీ సంతోష్



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)**సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ నూతన కమిషనర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన గణేష్ రెడ్డిని బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన బిఆర్ఎస్ యూత్ వింగ్ నాయకుడు ఎన్ సీ సంతోష్, అనంతరం వారు మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారానికి నూతన కమిషనర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు, బి ఆర్ ఎస్ నాయకులు శివ, బాకీ స్వామి,బొజ్జ రవి, నవాజ్, సింగం,మర్రి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో ఘనంగా జనహృదయనేత తన్నీరు హరీష్‌రావు జన్మదిన వేడుకలు



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** జనహృదయనేత, శాసనసభ పక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు జన్మదిన వేడుకలను గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. హరీష్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని గజ్వేల్ మండలం దాచారం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ. 2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. అనంతరం గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. కోమటిబండ గ్రామానికి చెందిన భాస్కర్, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ సుమన్, ములుగు మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, కాశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ తరఫున ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున మొత్తం రూ. 4 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ హరీష్‌రావు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో హరీష్‌రావు పాత్ర విశేషమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ, గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రాష్ట్ర వైస్ ఎంపీపీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి రాజమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, ఆత్మ కమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో బీజేపీకి షాక్.. జనసేనలోకి కమ్మరి శ్రీనివాస్

**- పవన్ కళ్యాణ్ సమక్షంలో చేరిక సిద్ధిపేట జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్న శీను**



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ పట్టణానికి చెందిన బీజేపీ నేత, టెలికం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీనివాస్ (శీను) బీజేపీకి గుడ్‌బై చెప్పి జనసేన పార్టీలో చేరారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆయన జనసేన కండువా కప్పుకున్నారు. వ్యక్తిగత కారణాలతో బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు కమ్మరి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌తో జరిగిన భేటీలో తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతంపై చర్చించినట్లు వెల్లడించారు. గజ్వేల్ నియోజకవర్గంతో పాటు సిద్ధిపేట జిల్లాలో జనసేన పార్టీని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలని పవన్ కళ్యాణ్ సూచించినట్లు శ్రీనివాస్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ జనసేన పార్టీ పోటీ చేసే అవకాశాలున్నాయని, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పోరాటాలు నిర్వహించాలని, ముఖ్యంగా రైతుల సమస్యలపై జనసేన కార్యకర్తలు ముందుండి పనిచేయాలని పవన్ కళ్యాణ్ సూచించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు అన్యాయాన్ని ఎదిరించే స్వభావం ఉందని, ఆ పోరాట స్ఫూర్తిని ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించాలని ఆయన ఆకాంక్షించినట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ప్రజా సేవా దృక్పథానికి ఆకర్షితుడై జనసేనలో చేరినట్లు కమ్మరి శ్రీనివాస్ తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంతో పాటు సిద్ధిపేట జిల్లాలో జనసేన పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు




ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) తహశీల్దార్ సుజాత కు, ఆర్ఐ శ్రవణ్ కు జన్మదినం సందర్భంగా ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళు మరెన్నో జన్మ దినోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి తహశీల్దార్ సుజాతకు స్వీటు తినిపించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసి చైర్మన్ షేక్ సబేరా బేగం, వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామ్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సాహెబ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ బాయ్, కొమిరిశెట్టి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ పాత్రికేయులు బండారిబాల్ రెడ్డి, మెండే శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొనిజన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రవేట్ పాఠశాలల బస్సుల వయోపరిమితి పెంచాలి



**రాయచోటి, జూన్ 03:** ప్రైవేటు పాఠశాలల బస్సుల వయోపరిమితిని పెంచాలని రాష్ట్ర ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు మదన్మోహన్ రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రిని మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి కోరారు బుధవారం రాయచోటిలో మదన్ మోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో గ్రామీణ విద్యార్థులకు సేవలందిస్తున్న ప్రైవేటు పాఠశాలల బస్సుల అమలు తీరుపై విపులంగా వివరించారు గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది విద్యార్థుల విద్యాభ్యాసానికి అండగా నిలుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులకు ప్రస్తుతం అమలులో ఉన్న 15 ఏళ్ల వయోపరిమితిని 20 ఏళ్లకు పెంచాలని ప్రైవేట్ విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి మండిపల్లె రామ్ ప్రసాద్ రెడ్డిను విజయవాడ-తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు విద్యార్థులకు రవాణా సేవలు అందిస్తున్నాయని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ బస్సులతో పోలిస్తే విద్యాసంస్థల బస్సులు రోజుకు కేవలం 30 నుంచి 60 కిలోమీటర్ల మేర మాత్రమే ప్రయాణిస్తాయని, 15 ఏళ్ల కాలంలో ఇవి సగటున 3 నుంచి 4 లక్షల కిలోమీటర్లు మాత్రమే తిరుగుతాయని వివరించారు. అదే సమయంలో ప్రభుత్వ బస్సులు 15 లక్షల కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తున్నప్పటికీ, విద్యాసంస్థల బస్సులపై కఠిన వయోపరిమితి విధించడం సమంజసం కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే విద్యాసంస్థల బస్సులకు 20 ఏళ్ల వరకు మినహాయింపు కల్పించిన విషయాన్ని గుర్తు చేసిన జేఏసీ నాయకులు, అదే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయాలని కోరారు. కోవిడ్ కాలంలో ప్రభుత్వ బస్సులకు రెండేళ్ల అదనపు సడలింపు ఇచ్చిన నేపథ్యంలో, విద్యాసంస్థల బస్సులకు కూడా న్యాయం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ రవాణా సౌకర్యాలు అందుబాటులో లేని చోట్ల విద్యాసంస్థల బస్సులే వేలాది మంది విద్యార్థులను పాఠశాలలు, కళాశాలలకు చేర్చుతున్నాయని తెలిపారు. వయోపరిమితి కారణంగా భారీ సంఖ్యలో బస్సులు రోడ్లపై నుంచి తప్పుకుంటే విద్యార్థుల రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన బస్సులును కొనుగోలు చేయాలంటే సుమారు 40 లక్షల వ్యయం అవుతోందని, అది విద్యార్థులకే భారం అవుతుందని విన్నవించారు. అదేవిధంగా విద్యాసంస్థల బస్సులపై విధిస్తున్న పన్నులను తగ్గించి విద్యారంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జేఏసీ కన్వీనర్ డా. పాపిరెడ్డి మదన మోహన్, కో-కన్వీనర్ మోహన్ రావు మంత్రికి సమస్యలను వివరించగా, మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు జేఏసీ ప్రతినిధులు వెల్లడించారు. విద్యార్థుల భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని విద్యాసంస్థల బస్సులకు 20 ఏళ్ల మినహాయింపు కల్పిస్తే వేలాది మంది విద్యార్థుల రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది అని జేఏసీ నాయకులు పేర్కొన్నారు.

## మునికూడలిలో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

**- వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ కావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.**



**రాజానగరం** రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతను, పురోగతిని పర్యవేక్షించిన ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ గారు, సంబంధిత అధికారులకు మరియు కాంట్రాక్టర్‌కు పలు కీలక సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు సకాలంలో అందేలా చూడటమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులను ఎలాంటి అలసత్వం లేకుండా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ×ఈ పర్యటనలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ గురజాల నియోజకవర్గ సమావేశం

**- 40 రోజుల"గో టు విలేజ్" కార్యక్రమంపై దిశ నిర్దేశం**



**పిడుగురాళ్ల** మ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ గురజాల నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ మరియు ఎం ఎస్ పి గురజాల నియోజకవర్గం అధ్యక్షులు మరియు పిడుగురాళ్ల మండల ఇన్చార్జి మీసాల బాబు మాదిగ నేతృత్వం వహించారు. మే 25 నుండి జూలై 5 వరకు (40 రోజుల పాటు) నిర్వహించబోయే ప్రతిష్టాత్మక "గో టు విలేజ్" కార్యక్రమం గురించిన భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు పల్నాడు జిల్లా ఇన్చార్జి దుడ్డు రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ, "గో టు విలేజ్" కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క కార్యకర్త గ్రామాల వైపు కదలాలని పిలుపునిచ్చారు. ఈ 40 రోజుల్లో ముఖ్యంగా మూడు లక్ష్యాలపై పని చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు:1). విద్యా చైతన్యం: గ్రామాల్లో విద్యా ప్రాముఖ్యతను ప్రతి కుటుంబానికి వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం మరియు పాఠశాల డ్రాపౌట్స్ లేకుండా చూడటం. 2). కమిటీల నిర్మాణం: గ్రామ, మండల స్థాయిల్లో ఎమ్మార్పీఎస్ అన్ని విభాగాలకు నూతన కమిటీలను బలోపేతం చేయడం. 3). జెండా ఆవిష్కరణలు: దండోరా జెండా ఆవిష్కరణలు జరగని ప్రతి గ్రామంలోనూ వంద శాతం జెండా ఎగురవేసేలా చర్యలు తీసుకోవడం. పాల్గొన్న ముఖ్య నాయకులు:ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వంగూరి అశోక్ మాదిగ ( ఎం ఈ ఎఫ్ జాతీయ నాయకులు), మాతాంగి సత్యానందం మాదిగ ( ఎం ఎస్ పి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్), దేవరకొండ సుశీల మాదిగ ( ఎంఎంఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు), గడ్డం సామేలు మాదిగ ( ఎం ఎస్ పి సీనియర్ నాయకులు), కొడవటి అశోక్ మాదిగ ( ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి), జడ బాబు మాదిగ ( ఎమ్మార్పీఎస్ గురజాల మండలం ఇన్చార్జి), ఎల్లోపేల మహేష్ మాదిగ ( ఎమ్మార్పీఎస్ దాచేపల్లి మండలం అధ్యక్షులు), ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వర్ల అగస్టీన్ మాదిగ తో పాటు గురజాల నియోజకవర్గ పరిధిలోని ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు మరియు మాదిగ యువకులు అత్యంత ఉత్సాహంగా, భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మందకృష్ణ మాదిగ ఆశయాల సాధన కోసం, "గో టు విలేజ్" కార్యక్రమాన్ని నియోజకవర్గంలో నూటికి నూరు శాతం విజయవంతం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

## పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి సమీక్ష

**- మంత్రి నిమ్మల రామానాయుడు**

**అమరావతి** పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్, అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి,ఎస్ ఈ రామచంద్ర రావు, ఏజెన్సీల ప్రతినిధులు మరియు ఇతర ఉన్నతాధికారులు హజరయ్యారు. పోలవరం ప్రాజెక్ట్ లో కీలకమైన ఈసిఆర్ఎఫ్ డ్యాం పనులు గ్యాప్-1 లో 45 శాతం, గ్యాప్-2 లో 22 శాతం పూర్తయ్యాయి. ఎడమ కాలువ పనులు ఈ ఏడాది ఆగష్టు నాటికి పూర్తి చేసి,అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్తాం. కుడి, ఎడమ కాలువల టన్నెల్స్ కనెక్టివిటీల పనులు 90 శాతం పూర్తయ్యాయి. స్పెల్ వేకి దిగువన బ్రిడ్జి నిర్మాణ పనులకు షెడ్యూల్ రూపొందించాం. సిఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం పోలవరం ప్రాజెక్ట్ కు ఏలూరు, కొవ్వూరు, రాజమండ్రి లకు జాతీయ రహదారులతో అనుసంధానించేలా పరిశీలిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును టూరిజం హబ్ గా లేఅవుట్ ప్లాన్ డిజైన్ చేసేందుకు 9900 ఎకరాల విస్తీర్ణంతో లైడార్ సర్వే పూర్తి చేశామని అన్నారు.

## పవన్ సభను అడ్డుకోవడం సమంజసం కాదు

**- అభివృద్ధిలో పోటీ పడాలి.. విద్వేషాల్లో కాదు**

**హైదరాబాద్,** హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సభకు అనుమతి నిరాకరణ , దాని చుట్టూ సాగుతున్న రాజకీయ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం తీవ్రంగా స్పందించారు. తెలంగాణ రాజకీయాల్లో పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలను, పోలీసుల ఆంక్షలను ఆయన తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీకైనా, ఏ నాయకుడికైనా ఎక్కడైనా పర్యటించే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పవన్ కళ్యాణ్‌ను, జనసేన కార్యక్రమాలను అడ్డుకోవాలని చూడటం ఎంతమాత్రం కరెక్ట్ కాదని సీఎం చంద్రబాబు నాయుడు ఖరాఖండీగా చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు తమ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సభలు, సమావేశాలు నిర్వహించుకోవడం సహజమని.. దాన్ని అడ్డుకోవాలని చూడటం అప్రజాస్వామికమని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ సభకు ఆంక్షలు విధించడం, ఆయనను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించడం వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలను ప్రజలు గమనిస్తున్నారని బాబు పేర్కొన్నారుభారతదేశంలో ఉన్న ఫెడరల్ స్ఫూర్తిని గుర్తు చేస్తూ చంద్రబాబు ఈ సందర్భంగా కీలక ఉదాహరణలను లేవనెత్తారు. గతంలో తమిళనాడు ఎన్నికల సమయంలో నేను వెళ్లి అక్కడ ప్రచారం చేశాను. అలాగే కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నేత, ప్రస్తుత సీఎం డీకే శివకుమార్ కూడా ఇతర రాష్ట్రాల్లో యాక్టివ్‌గా ప్రచారం చేశారు. మనమంతా ఒకే దేశంలో ఉన్నప్పుడు ఒక రాష్ట్ర నేత పక్క రాష్ట్రానికి వెళ్లకూడదనే నిబంధన ఎక్కడైనా ఉందా? అని చంద్రబాబు నిలదీశారు. పవన్‌ను ప్రాంతం పేరుతో టార్గెట్ చేస్తున్న వారికి ఈ వ్యాఖ్యల ద్వారా ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ నేతలు అనుసరిస్తున్న తీరుపై చంద్రబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అసలు ఎందుకు ఇలా చేస్తున్నారో నాకైతే అర్థం కావడం లేదు. రాజకీయాల్లో ఉంటే ప్రజలకు ఎవరు ఎక్కువ సేవ చేస్తారు, ఎవరు ఎంత బాగా అభివృద్ధి చేస్తారనే విషయంలో పార్టీలు పోటీ పడాలి. అంతే తప్ప, ప్రజల మధ్య లేనిపోని ప్రాంతీయ విద్వేషాలను రగిల్చి రాజకీయం చేయాలని చూడటం సరైన పద్ధతి కాదు అని హితవు పలికారు. ప్రజల మధ్య గోడలు కట్టాలని చూసే ప్రయత్నాలను నాయకులు మానుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి 12 సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత కూడా.. ఇంకా పాత ఆంధ్రా-తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేయడంపై చంద్రబాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక స్థిరమైన రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడి, ఇరు రాష్ట్రాల మధ్య సామరస్యపూర్వక వాతావరణం నెలకొంటున్న తరుణంలో.. మళ్లీ పాత వివాదాలను తవ్వి తీయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. రాజకీయాల కోసం పాత సెంటిమెంట్ల ముసుగులోకి వెళ్లడం నాయకుల బలహీనతకు నిదర్శనమన్నారు. తెలంగాణ సమాజం అత్యంత చైతన్యవంతమైనదని, ఇక్కడ ఎవరు ఎలాంటి రాజకీయం చేస్తున్నారో ప్రజలందరికీ బాగా తెలుసని చంద్రబాబు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఎవరి పాత్ర ఎంత ఉందో, ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత ఎవరు ఏ రకమైన సేవలందించారో ప్రజల మనసుల్లో స్పష్టంగా ఉందన్నారు. కాబట్టి ఓట్ల కోసం, పబ్లిసిటీ కోసం పవన్ కళ్యాణ్ లాంటి నేతలను టార్గెట్ చేస్తూ ఇరుకైన రాజకీయాలు చేయడం ఎవరికీ మంచిది కాదని చంద్రబాబు బుధవారం స్పష్టం చేశారు.

## టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతించిన తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు

**హైదరాబాద్** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తాజా చిత్రం 'పెద్ది' ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా టికెట్ ధరలను పెంచుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుమతించిన సంగతి తెలిసిందే. ఈ ఇరు రాష్ట్రాల ప్రభుత్వ పెద్దలకు రాంచరణ్ ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు: "తెలుగు సినిమా పరిశ్రమకు నిరంతరం మద్దతు, ప్రోత్సాహం అందిస్తున్న గౌరవనీయులైన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ గారు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని రామ్ చరణ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు: "తెలుగు చిత్ర పరిశ్రమ అభ్యున్నతికి నిరంతరం తోడ్పాటునందిస్తున్న గౌరవనీయులైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు మరియు తెలంగాణ ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని చరణ్ రాసుకొచ్చారు. ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటించింది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతి బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించారు. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# 'కార్మేని సెల్వమ్' మూవీ రివ్యూ!



సముద్రఖని ఒక వైపున తెలుగు .. తమిళ భాషల్లో కీలకమైన పాత్రలను చేస్తూనే, మరో వైపున కథానాయకుడిగా ప్రధానమైన పాత్రలను పోషిస్తూ వెళుతున్నాడు. అలా ఆయన ప్రధానమైన పాత్రను పోషించిన తమిళ సినిమానే 'కార్మేని సెల్వమ్'. అరుణ్ రంగరాజులు నిర్మించిన ఈ సినిమాకి, రామ్ చక్రి దర్శకత్వం వహించాడు. ఏప్రిల్ 3వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ రోజు (జూన్ 3వ తేదీ) నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు ఇతర భాషల్లోను అందుబాటులోకి వచ్చింది. చెన్నై సముద్రతీరంలోని ఒక స్లమ్ ఏరియాలో, సెల్వమ్ (సముద్రఖని) కుటుంబం నివసిస్తూ ఉంటుంది. భార్య శాంతి (లక్ష్మీ ప్రియ) ఇడ్లీ బండీ నడుపుతూ ఉంటుంది, వారి ఏడేళ్ల కొడుకే బాలు. తన భర్త సొంత కారు కొనుక్కుని టాక్సీ నడుపుకోవాలనీ, అలాగే సొంత ఇంటిని కట్టుకోవాలనేది శాంతి ఆశ .. ఆలోచన. సిటీలో ఉండే సంపత్ (గౌతమ్ మీనన్) ఆయన భార్య దేవి (అభినయ)కి సెల్వమ్ కారు డ్రైవర్ గా పనిచేస్తూ ఉంటాడు. సొంతకారు .. సొంత ఇల్లు తీసుకోవడం కోసం శాంతి డబ్బు కూడబెడుతూ ఉంటుంది. అయితే ఆ డబ్బు సెల్వమ్ మేనకోడలికి 'సారె' క్రింద ఇచ్చేస్తుంది. అందుకోసం తన 'తాళి'ని కూడా తాకట్టు పెడుతుంది. సొంత కారు - సొంత ఇల్లు తీసుకుని భార్య ముచ్చట తీర్చాలనేది సెల్వమ్ కోరిక. అందుకోసం ఏం చేయాలనే దిశగా అతను ఆలోచన చేస్తుండగా, సంపత్ తన ఫ్యామిలీతో ఫారిన్ వెళతాడు. ఆ సమయంలో ఆయన కారును సెల్వమ్ ట్యాక్సి సర్వీస్ లో పెడతాడు. ధనవంతులు కావాలంటే ముందుగా ధనవంతులుగా బ్రతకడం నేర్చుకోవాలనే మాట పట్టుకుని,సెల్వమ్ అప్పులు చేయడం మొదలు పెడతాడు. స్థలం కొనుగోలు చేయడమే కాకుండా, ప్రతి చిన్న అవసరానికి క్రెడిట్ కార్డును వాడుతూ ఉంటాడు. భార్య ఎంతగా చెబుతున్నా వినిపించుకోకుండా పెద్ద మొత్తంలో అప్పులు చేస్తాడు. ఆ అప్పులను తీర్చడం కోసం సెల్వమ్ ఏం చేస్తాడు? ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటాడు? అనేది మిగతా కథ. జీవితంలో ప్రతి ఒక్కరికీ ఆశ ఉంటుంది. ఉన్నదానికంటే కాస్త బాగా బ్రతకాలనే కోరిక ఉంటుంది. అయితే అందుకు అప్పు చేయడకూడదనేది శాంతి అభిప్రాయం. అప్పు అనేది చేయకపోతే కొన్ని ఆనందాలను ఎప్పటికీ పొందలేమనేది ఆమె భర్త ఆలోచన. అందునా భార్య ముచ్చట తీర్చడం కోసం అప్పు చేసినా తప్పులేదనేది ఆయన ఉద్దేశం. అలాంటి ఆ దంపతుల చుట్టూ అల్లుకున్న కథ ఇది. జీవితమనే ప్రయాణంలో ఎవరి స్థాయిలో వారికి కోరికలు ఉంటాయి. అయితే ఆ కోరికలను నిదానంగా నెరవేర్చుకుందామని భావించేవారు కొందరైతే, సాధ్యమైనంత త్వరగా తీర్చేసుకుందామని అనుకునేవారు కొందరు. అలాంటి వర్గాలకి ప్రతినిధులుగా ఇద్దరు భార్యాభర్తలను చూపిస్తూ, ఎవరి ఆలోచన సరైనది? అనే ప్రశ్నకు సమాధానంగా ఈ సినిమా నడుస్తుంది. కథలో ప్రధానమైన భాగమంతా భార్యాభర్తల నేపథ్యంలోనే నడుస్తుంది. 'కష్టపడితే వచ్చిన డబ్బును కాదనకు .. కష్టపడకుండా డబ్బు వస్తుందంటే నమ్మకు' అనే కాన్సెప్ట్ చుట్టూనే తిరుగుతుంది. భార్యాభర్తల పాత్రలను దర్శకుడు డిజైన్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. వాళ్ల పాత్రల వైపు నుంచి ఉన్న ఎమోషన్స్ కనెక్ట్ అవుతాయి. గౌతమ్ మీనన్ - అభినయ ట్రాక్ కూడా మనసులను సున్నితంగా తాకుతుంది. సంపాదన అనే పరుగులో మనిషి తనని తాను మరిచిపోతున్నాడనే విషయాన్ని చెబుతుంది. ఈ సినిమాను మనం ఫస్టాఫ్ - సెకండాఫ్ గా చూడలేము. మొత్తం ఒక ఎమోషన్ గా మనముందు నిలిచే కంటెంట్ ఇది. నాలుగైదు ప్రధానమైన పాత్రలతో .. ఒక సింపుల్ లైన్ ను బలంగా చెప్పడం దర్శకుడి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. యువరాజ్ దక్షన్ ఫొటోగ్రఫీ .. జగన్ ఎడిటింగ్ .. నేపథ్య సంగీతం ఈ కంటెంట్ ను మరింత బలంగా కనెక్ట్ చేస్తాయి. స్మార్టు ఫోన్లు .. యాప్ లు .. ఆఫర్లు .. ఆకర్షణలు, ఆన్ లైన్లో అవి విసిరే వలల గురించి దర్శకుడు టచ్ చేసిన తీరు బాగుంది. తెలిసీ తెలియక వీటి బారినపడి ఎంతమంది అప్పుల పాలవుతున్నారనేది వివరించిన విధానం మెప్పిస్తుంది. బలంగా మారడమంటే .. బలహీనలతలను వదులుకోవడమే అనే నిజాన్ని అందంగా .. సున్నితంగా ఆవిష్కరించిన సినిమా ఇది. ఈ సినిమా మొత్తంలో అనవసరమైన సన్నివేశం ఎక్కడా కనిపించదు. ప్రేక్షకులకు అవసరమైన వినోదాన్ని అందిస్తూనే, వాళ్లను ఆలోచింపజేసే సందేశం ఉంది. 'అనవసరమైనవి కొంటూపోతే, అవసరమైనవి కోల్పోతాం' అనే డైలాగ్, ఈ సినిమా మొత్తాన్ని కలిపి చెబుతుంది. ఆదాయానికి మించి .. అవసరాలకు మించి ఖర్చు చేయకూడదు. ఆశల వెంట తీసే పరుగు, కుటుంబానికి దూరం చేస్తుంది. భార్యాబిడ్డలతో కలిసి ఉండటంలోనే అసలైన ఆనందం ఉంది .. సర్దుకుపోవడంలోనే సంతోషం ఉందని చాటిన సినిమా ఇది.

# కొరియా టూరిజం రాయబారిగా ప్రియాంక



'ఓజీ' బ్యూటీ ప్రియాంక మోహన్‌కి అరుదైన అంతర్జాతీయ గౌరవం దక్కింది. కొరియా టూరిజం ఆర్గనైజేషన్ ఆమెను 'కొరియా టూరిజం గౌరవ రాయబారి'గా నియమించింది. ఇటీవలే ఆమె 'మేడిన్ కొరియా' అనే ఓటీటీ సినిమాలో నటించిన విషయం తెలిసిందే. ఇందులో కొరియా వెళ్లడం జీవితాశయంగా పెట్టుకున్న తమిళ అమ్మాయిగా ప్రియాంక మోహన్ నటించింది. ఓటీటీలో విడుదలైన ఈ చిత్రానికి విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఈ నేపథ్యంలో కొరియన్ గవర్నమెంట్ ఆమెకు ఈ గౌరవాన్ని అందించడం విశేషం. కొరియన్ సంస్కృతి, పర్యాటక రంగంపై భారతీయ యువతలో అవగాహన పెంచేందుకుగాను ఆమెను ఈ పదవికి ఎంపిక చేశారు. ఈ బాధ్యతాను గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ప్రియాంక మోహన్ ఆనందం వ్యక్తం చేసింది.

# 'పెద్ది' ఈవెంట్‌లో కలకలం..

## రామ్ చరణ్ అభిమాని అత్యుత్సాహంతో ఉలిక్కిపడిన జాన్వీ!

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ జంటగా నటించిన చిత్రం 'పెద్ది'. ఈ సినిమా ప్రమోషనల్ ఈవెంట్‌లో ఒక ఊహించని ఘటన చోటుచేసుకుంది. ఓ అభిమాని అత్యుత్సాహం ప్రదర్శించడంతో నటి జాన్వీ కపూర్ భయంతో ఉలిక్కిపడ్డారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.విజయవాడలో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో రామ్ చరణ్, జాన్వీ వేదికపై పక్కపక్కనే కూర్చుని ఉండగా.. ఓ అభిమాని ఆయన్ను కలిసేందుకు వేదికపైకి దూసుకొచ్చాడు. ఈ క్రమంలో బ్యాలెన్స్ కోల్పోయిన ఆ అభిమాని, జాన్వీ కూర్చున్న సోఫా హ్యాండిల్‌పై పడిపోయాడు. దీంతో ఆమె ఒక్కసారిగా భయవడిపోయింది. వెంటనే అప్రమత్తమైన రామ్ చరణ్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది కెవిన్ కుంటా.. ఆ అభిమానిని అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై నెటిజన్లు స్పందిస్తూ.. 'ఇంటర్నేషనల్ లెవెల్ సెక్యూరిటీ' అంటూ భద్రతా సిబ్బందిని ప్రశంసిస్తున్నారు.అయితే, ఈవెంట్ ముగిసిన తర్వాత రామ్ చరణ్ అదే అభిమానిని ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. ఈ భేటీలో ఆ అభిమాని చరణ్‌కు కృతజ్ఞతలు చెప్పి, ఆయన పాదాలకు నమస్కరించాడు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' చిత్రంలో శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా రేపు (జూన్ 4న) ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఇకపై ప్రేక్షకులను మోసం చేయలేం..

## వాళ్లు చాలా అప్‌డేట్ అయ్యారు: పూజా హెగ్డే



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే థియేట్రికల్ సినిమా ప్రస్తుత పరిస్థితిపై చేసిన కొన్ని ముక్కుసూటి వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పూజ మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో ప్రేక్షకులు ఎంతగానో అప్‌డేట్ అయ్యారని, సినిమా ఎంపికలో ఎంతో నిశితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. థియేటర్లలో సినిమా చూసేటప్పుడు అది నిజంగా ఎంటర్‌టైన్ చేస్తుందా లేదా అనేది మొదటి కొన్ని నిమిషాల్లోనే ప్రేక్షకులు జడ్జ్ చేయగలరని ఆమె అభిప్రాయపడ్డారు."ఇకపై మనం నకిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రేక్షకులను మోసం చేయలేం. థియేటర్లలో ఏ సినిమా చూడాలో ఎంచుకునే విషయంలో వారు చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. ఒక సినిమా వారి హృదయానికి కనెక్ట్ అవుతుందా? లేదా? అనేది ప్రేక్షకులు చాలా త్వరగా గ్రహిస్తున్నారు" అని పూజా హెగ్డే స్పష్టం చేశారు. కమర్షియల్ సినిమాల్లో నటించేటప్పుడు గ్లామర్, ఎమోషన్, కామెడీ, డ్యాన్స్, నటన.. ఇలా అన్నింటినీ ఒకేసారి పర్ఫెక్ట్‌గా డెలివరీ చేయడం నటీనటులకు ఒక పెద్ద సవాల్ అని ఆమె పేర్కొన్నారు. దీనికి తోడు ఓటీటీ, రీల్స్ వంటి షార్ట్-ఫార్మ్ కంటెంట్ నుండి వస్తున్న గట్టి పోటీ కారణంగా థియేట్రికల్ రిలీజ్ అనేది మేకర్స్‌కు ఒక నిజమైన పరీక్షగా మారిందని ఆమె విశ్లేషించారు.అయితే ఈ సవాళ్లు ఎన్ని ఉన్నప్పటికీ, బిగ్ స్క్రీన్ ఎక్స్‌పీరియన్స్‌పై పూజ పూర్తి ఆశాభావం వ్యక్తం చేశారు. థియేటర్లలో అందరితో కలిసి నవ్వుతూ, చప్పట్లు కొడుతూ, డ్యాన్స్ చేస్తూ సినిమా చూడటంలో ఉండే ఆనందమే వేరని.. ఆ సామూహిక అనుభూతిని ఓటీటీలో ఒంటరిగా చూస్తూ ఎప్పటికీ పొందలేమని ఆమె చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ పరిశ్రమల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న పూజా హెగ్డే.. త్వరలోనే 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.

# ధిక్కారమే నా నైజం



హీరో రామ్ పోతినేని నటిస్తున్న 23వ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ సినిమా ద్వారా ఆయన తొలిసారి మెగాఫోన్ పట్టబోతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణం నుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. సైకలాజికల్ థ్రిల్లర్ కథాంశమిది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వూల్ఫ్' అంటూ ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలో ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు రామ్ పోతినేని. 20ఏళ్ల సినీ ప్రయాణంలో నటుడిగా, వ్యక్తిగా ఎంతో పరిణతి సాధించానని, ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొన్నా ఏనాడు భయపడలేదని అన్నారు. '18ఏళ్ల వయసులో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టా. జయాపజయాల నుంచి ఎన్నో పాఠాల్ని నేర్చుకున్నా. పరిస్థితులు మనల్ని ఎప్పుడూ భయపెట్టడానికి ప్రయత్నిస్తుంటాయి. కానీ రెబల్‌గా ఉండటమే నా నైజం. నా రూల్స్ ప్రకారం జీవితాన్ని సాగిస్తున్నా. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్నదే నా ఫిలాసఫీ' అని చెప్పారు రామ్ పోతినేని. 'రాపో' సినిమాటిక్స్ పతాకంపై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# ప్రేమలో నువ్వే కదా..

స్వీయ నిర్మాణంలో వడ్డే నవీన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్‌తేజ నార్ల దర్శకత్వం వహిస్తున్నారు. రాశిసింగ్ కథానాయిక. ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం 'నువ్వే కదా..' అనే పాటను విడుదల చేశారు. కల్యాణ్‌నాయక్ స్వరపరచిన ఈ పాటను భాస్కరభట్ల రచించారు. రోహిత్, హరిణి ఆలపించారు. నాయకానాయికల మధ్య ప్రేమానురాగాల్ని ఆవిష్కరించే గీతమిదని, చక్కటి సాహిత్యంతో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. సుదీర్ఘ విరామం తర్వాత వడ్డే నవీన్ నటిస్తున్న ఈ చిత్రాన్ని విభిన్న కథాంశంతో తెరకెక్కిస్తున్నామని, ఆయన పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్, నిర్మాత: వడ్డే నవీన్, దర్శకత్వం: కమల్‌తేజ నార్ల.



# సంకటాలు తొలిగించే సంకష్టహర చతుర్థి

**- అధిక జేష్ఠ మాసం అత్యంత పవిత్రమైనది**



**మంథని ( ప్రశ్న న్యూస్)**అధిక జేష్ఠ మాసంలో వచ్చిన సంకష్టహర చతుర్థి అత్యంత పవిత్రమైనది. నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధికమాసంలో శ్రీ గణనాథుని పూజిస్తే అంతా శుభం జరుగుతుంది. సంకష్టహర చతుర్థి సందర్భంగా బుధవారం గణనాథుని ఆలయాల్లో భక్తులు విఘ్నేశ్వరుని దర్శించుకుని పునీతులయ్యారు. దైనందిన జీవితంలో మానవులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ సంకష్టహర చతుర్థి దీక్షతో తొలగిపోతాయి. కొత్తగా చతుర్థి దీక్ష తీసుకునేవారు అధిక మాసంలో వచ్చే చతుర్థి రోజున దీక్ష తీసుకోవడం ఎంతో శ్రేయష్కారం. ప్రతి మనిషి తన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలు తీరడానికి సంకష్టహర చతుర్థి రోజున ఉపవాస దీక్ష తీసుకోవడం ఎంతో శ్రేయస్కారం. సంకష్టహర చతుర్థి రోజున శ్రీ విఘ్నేశ్వరుని పూజించి ఆలయంలో 21 ప్రదక్షిణాలు చేసి మోదకులు ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే అన్ని సంకటాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. జేష్ఠమాసంలో వచ్చిన చతుర్థి ఎంతో విశిష్టమైనది. మంథని పట్టణంలోని శ్రీ మహా గణపతి దేవాలయంలో సిద్ధి, బుద్ధి సమేతంగా కొలువుతీరిన గణనాథున్ని సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గణపతికి ఇష్టమైన వారం మంగళవారం అలాగే నవగ్రహాల్లోని కుజ గ్రహ దోషం పోవాలన్న బుధవారం వచ్చిన చతుర్థి రోజున "ఓం గం గణపతియై నమః " అని స్మరిస్తూ విఘ్నేశ్వరున్ని దర్శించుకుంటే అన్ని సంకటాలు తొలగిపోతాయి. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి రోజున సంకష్టహర చతుర్థి వస్తుంది ఏడాదిలో ఒకసారి మంగళవారం వచ్చే చతుర్థి ని అంగారక అంటారు. ఈ రోజున రాత్రి 9. 30 గంటలకు చంద్రోదయం అనంతరం స్వామివారికి పూజ చేసి భోజనం చేయడం ఎంతో శ్రేయష్కారం. ఈ రోజున ఉపవాస దీక్ష స్వీకరిస్తే జీవితంలో ఎదుర్కొంటున్న విఘ్నాలన్ని తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా శ్రీ మహాగణత దేవాలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. దేవతలలో మొట్టమొదట పూజించబడే ఎంతో విశిష్టత కలిగిన శ్రీ విఘ్నేశ్వరున్ని పూజించడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోయి అంతా శుభం జరుగుతుందనే విశ్వాసంతో సంకష్టహర చతుర్థి దీక్షను స్వీకరిస్తారు. ఈ రోజున విఘ్నేశ్వరునికి ఇష్టమైన గరిక ( దూర్వాలు ) సమర్పించడం అలాగే 21 ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే విఘ్నేశ్వరునికి ప్రీతిపాత్రలవుతారు అని శాస్త్రాల్లో పేర్కొనబడింది. ఈ రోజున చంద్రోదయం అనంతరం భోజనం చేయడం ఈ దీక్షలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఆలయ పూజారి పల్లి రాము భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

## ఎమ్మెల్యే సత్యం జన్మదినం సందర్భంగా
# వంశీ గౌడ్ వినూత్న కనుక

**- ప్రజా నాయకుడికి సంగీత రూపంలో జన్మదిన శుభాకాంక్షలు**
**- చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ సత్యం కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు**




**బోయినిపల్లి / కరీంనగర్ (ప్రశ్న న్యూస్)**చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం జన్మదినోత్సవం ఈనెల 5న ఉన్నందున బోయినిపల్లి మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నాగుల వంశీ గౌడ్ ప్రత్యేక గీతాన్ని రూపొందించారు. ఈ పాటను బుధవారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగుల వంశీ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ సేవలందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక గీతాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో మండల అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన సుఖీన్ యాదవ్, నాయకులు సుధాకర్,భాస్కర్, శాలివాహన శ్రీనివాస్,అనిల్, దేవయ్య,తదితరులు పాల్గొని ఎమ్మెల్యే సత్యంకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఫీడర్ ఛానల్ పనులకు శ్రీకారం

**- ఫీడర్ ఛానల్ పనులతో సాగునీటి సౌకర్యాలు మెరుగుదల**
**- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఫీడర్ ఛానల్ పనులను గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో పాటు గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ఫీడర్ ఛానల్ పనులతో సాగునీటి సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి దోహదపడే ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జోగు శంకర్, గోల్కొండ సూరి, ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర కనుకరాజు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీ,"2"వీలర్ యాజమాని సేఫ్




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ లో టూ వీలర్స్ కి సేఫ్ లేకుండా పోయింది.ఈ భాగ్యనగరంలో బడ బడా వాహనాలతో చిన్న వాహనాలకు పొంచి ఉన్న ప్రమాదాలు.మరి ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు అంటేనే వాహనదారుల్లో భయం భయంతో హడలెత్తిపోతున్నారు.ప్రధానదారిల్లో ఆడ,మగ తేడాలేకుండా బస్సు చక్రాల కింద నలిగిపోతున్న ప్రాణాలు.చిన్న వయస్సులోనే నూరెళ్లు నిండిపోతున్న పసి పిల్లల జీవితాలు.సిటిలో ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.కొందరు ప్రాణాలు కోల్పోతే, మరికొందరు శరీరంలో కాలో,చెయ్యో విరిగి ఇంటికి పరిమితం అవుతున్నారు.ఈనేపధ్యంలో నిన్న బుధవారం ఉదయం 11:31 నిమిషాలకు జూబ్లీ బస్ స్టాండ్ చౌరస్తాలో శామీర్ పేట నుంచి వస్తున్న జూబ్లీ బస్ నాన్ స్టాప్ సూపర్ లక్సరీ బస్సు ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి బీభత్సం సృష్టించింది.అతివేగంగా జేబీఎస్ నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికుల పైకి దూసుకెళ్లింది.విధులు ముగించుకుని జూబ్లీ బస్ స్టేషన్ నుండి కార్ఖానా వైపుకు వెళుతున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు శివ పేర్కొన్నాడు.ద్విచక్ర వాహనదారుడు శివపై బస్సు దూసుకెల్లడంతో అతను బస్సు చక్రాల కింద ఇరుక్కుపోయాడు.వెంటనే ఇది గమనించిన మారేడుపల్లి ట్రాఫిక్ పోలీసులు, వాహనదారులు క్రేన్ సహాయంతో బస్సును పక్కకు జరిపి ద్విచక్ర వాహనాన్ని బయటకు తీసి శివను సురక్షితంగా కాపాడారు.ఈ ఘటనలో శివ కాలికి తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన అతన్ని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ఆర్టీసీ బస్సు అతివేగం వల్లనే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు శివ తెలిపాడు.ఈ రోడ్డు ప్రమాదంపై వాహనదారులు ఓ పక్క మండె ఎండలతో అల్లాడిపోతున్నాం,మరో పక్క రోడ్డు పై ప్రయాణం చేయాలంటేనే భయంగా ఉందంటున్నారు వాహనదారులు.

# ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయాలి

**- బోయినిపల్లి ఎంపీడీఓ : జయశీల**




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జూన్ 4, 6, 8, 10 తేదీల్లో మండలంలోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు బోయినిపల్లి ఎంపీడీఓ భీమా జయశీల తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ సభల్లో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణ, పంటల వైవిధ్యీకరణ, వర్షాకాల ముందస్తు చర్యలు, మహిళల రక్షణ, వనమహోత్సవం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామసభలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## మాజీ మంత్రి రాజేశం గౌడ్‌ను
# పరామర్శించిన ప్రముఖ వైద్యులు



**జగిత్యాల (ప్రశ్న న్యూస్)**మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ గోడిశెల రాజేశం గౌడ్‌కు ఇటీవల మోకాలి మార్పిడి శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో, హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ శివరాం, డాక్టర్ హర్ష, డీఎస్ఆర్ సింగ్ మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా రాజేశం గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వైద్యులు, వైద్యుల సూచనలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన త్వరితగతిన ఆరోగ్యవంతులై తిరిగి ప్రజా సేవలో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

# అంగన్వాడిల సమస్యపై డి డబ్ల్యు ఓ కు వినతి



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** అంగన్వాడీల సమస్యపై డి డబ్ల్యూ ఓ శారద కు నూతనకల్ కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనకల్ గ్రామంలో రెండు అంగన్వాడి సెంటర్లు ఉన్నాయని, రెండు అంగన్వాడి సెంటర్లలో అంగన్వాడి టీచర్లు లేక ఒక సెంటర్ పూర్తిగా మూసివేశారని తెలిపారు.2 అంగన్వాడి సెంటర్ లో వేరే గ్రామం ఇన్చార్జి తో తాత్కాలికంగా అంగన్వాడిని నడుపుతున్నారని,ఆ అంగన్వాడికి ఆయమ్మ లేక పిల్లలకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కావున నూతనకల్ గ్రామ ప్రజల కోరిక మేరకు రెండు అంగన్వాడీ కేంద్రాలకు ఇద్దరు అంగన్వాడి టీచర్లకు ఇద్దరు హెల్పర్స్ ని ఏర్పాటు చేసి మా గ్రామంలో సమస్యను తీర్చాలని కోరారు. 4 వేల పైచిలుకు జనాభా గల గ్రామం గర్భిణీ స్త్రీలకు పోషిక ఆహార విషయంలో, అంగన్వాడి పిల్లలను పంపే విషయంలో గ్రామస్తులు చాలా ఇబ్బంది పడుతున్నారని, నూతనకల్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో ఒక ఆశా వర్కర్ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి కావున నూతనకల్ గ్రామానికి ఐదు పోస్టులు భర్తీ చేసి గ్రామ సమస్యను తీర్చాలని కోరారు. సానుకూలంగా స్పందించి రెండు నెలల్లో అంగన్వాడీ సమస్యను పూర్తిగా తీరుస్తామని జిల్లా డబ్ల్యు ఓ అధికారిని శారద హామీ ఇచ్చారని తెలిపారు.

# మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ రూరల్ పరిధిలోని విద్యారణ్యపురిలో దొండు అరుణ్ కుమార్ (35) అనే పెయింటర్ కుటుంబ కలహాల నేపథ్యంలో మద్యం మత్తులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కర్రీ (కూర) తీసుకురావడానికి బయటకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

## గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన
# బోనాల ఉత్సవాలు

**- గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు**
**- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్**





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలో గ్రామ ఆరాధ్య దేవతలు శ్రీ పోచమ్మ తల్లి, శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, శ్రీ దుర్గమ్మ తల్లి వారి బోనాల మహోత్సవాలు గత నెల 31 న ప్రారంభమై భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ముగిశాయి. బుధవారం మహోత్సవాలు విజయవంతంగా పూర్తైన సందర్భంగా గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఐక్యంగా పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించడం, యువత, పెద్దలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొనడం వల్ల గ్రామమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందని పేర్కొన్నారు.గ్రామంలోని పోచమ్మ, మహాలక్ష్మి, దుర్గమ్మ ఆలయాలను పునర్నిర్మించి అభివృద్ధి చేయడం గ్రామ ప్రజల సహకా రంతోనే సాధ్యమైందని సర్పంచ్ తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తామని అన్నారు.బోనాల మహోత్సవాలను విజయవంతం చేయుటలో కృషి చేసిన ఉప సర్పంచ్ కుసుంబ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, నాయకులు గూడ బాలకిషన్, చెంచు సంపత్, ఎల్ల కిషన్ రెడ్డి, ఉమ్మారెడ్డి అనిల్ రెడ్డి, కొనుకటి కమలాకర్, అనుముల దేవయ్య, అనుముల అనంతరెడ్డి, జక్కని లక్ష్మినారాయణ, కొనుకటి చంద్రయ్య, ఆవుల నాగరాజు, ఆవుల మల్లయ్యతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.బోనాల మహోత్సవాల సందర్భంగా గ్రామంలో భక్తి, ఆనందం, ఐక్యత ప్రతిఫలించాయని, ఇలాంటి కార్యక్రమాలు గ్రామ సంస్కృతి, సంప్రదాయాలను మరింత బలోపేతం చేస్తాయని సర్పంచ్ అనుముల భాస్కర్ పేర్కొన్నారు.

# బి ఆర్ ఎస్ తిరుగుబాటు నేతల కథ సుఖాంతం

**- తిరుగుబాటు నేతలను అక్కున చేర్చుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి**



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ బిఆర్ఎస్ లో తిరుగుబాటు నేతల కథ సుఖాంతమైంది. మేడ్చల్ బి ఆర్ఎస్ లో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఉండడం లేదు అంటూ పలువురు తిరుగుబాటు నేతలు ఇటీవల పార్టీకి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఇటీవల మేడ్చల్ లోని కేఎల్ఆర్ వెంచర్ లో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఉమ్మడి మేడ్చల్ మండల కార్యకర్తల సమావేశంలో ఈ నేతలు తిరుగుబాటు చేశారు. పార్టీలో ఉద్యమకారులకు ప్రాధాన్యత లేకుండా పోతుంది అంటూ ఆరోపణలు చేస్తూ స్థానిక నేతలపై విమర్శల జల్లులు కురిపించారు. ఈ సంఘటన మరువక ముందే నిన్న జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవం లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించి మళ్లీ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారు. ఈసారి ఓ అడుగు ముందుకేసి ఎమ్మెల్యే మల్లారెడ్డి ని టార్గెట్ చేస్తూ ఆయనపై విమర్శలు గుప్పించారు. అయితే పరిస్థితి చేయి జారిపోతుందన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి తిరుగుబాటుదారులను తన ఇంటికి పిలిపించుకొని అక్కున చేర్చుకున్నారు. దీంతో తిరుగుబాటు దారులు చల్లబడి జై తెలంగాణ అంటూ పార్టీలో విలీనం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఒక కుటుంబం లాంటిదని చిన్నచిన్న విభేదాలు వస్తుంటాయి.. పోతుంటాయని అందరం కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఇందుకోసం అందరం కలిసికట్టుగా కష్టపడాలని సూచించారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నిలువు దోపిడి



- బడులు తెరవకముందే తల్లిదండ్రుల జేబులపై దండయాత్ర
- అనుమతులు ఒకటవ తరగతికి... బోధన పదో తరగతి వరకు
- ఫైర్, శానిటేషన్, ట్రాఫిక్ నిబంధనలు గాలికొదిలి విద్యా వ్యాపారం
- ఫీజు నియంత్రణ చట్టం అమలు ఎప్పుడు.? అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు

(గౌటి రామకృష్ణ - ప్రశ్న న్యూస్ )




కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల కత్తిని పదును పెట్టాయి. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుకున్న కొందరు యాజమాన్యాలు తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పిల్లల భవిష్యత్తు పేరుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్న ఈ ఫీజుల దోపిడి దందాపై ప్రభుత్వ యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.గత ఏడాదితో పోలిస్తే ఈసారి అనేక ప్రైవేట్ పాఠశాలలు 20 నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రాథమిక తరగతులకే రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు, హైస్కూల్ విద్యార్థులకు రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తుండటం తల్లిదండ్రులను ఆందోళన కలిగిస్తోంది. టెక్నో, ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ కరిక్యులం వంటి పేర్లతో ఫీజుల మోత మోగిస్తున్నారని పేరెంట్స్ వాపోతున్నారు.

### చదువు చెప్పాల్సిన స్కూళ్లు.. కిరాణా దుకాణాలుగా మారాయా.?

విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన విద్యాసంస్థలు ఇప్పుడు పుస్తకాలు, యూనిఫాంలు, షూస్, బెల్టులు అమ్మే వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్కూల్ ఆవరణలోనే లేదా యాజమాన్యం సూచించిన దుకాణాల్లోనే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్‌లో రూ.2 వేలకే లభించే పుస్తకాల సెట్లను రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు విక్రయిస్తూ తల్లిదండ్రుల జేబులను ఖాళీ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు వాళ్ల నుండి మామూళ్లు తీసుకొని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### అనుమతులు ఒకటి నుంచి ఏడో తరగతి వరకు బోధన పదో తరగతి వరకు.?

కొన్ని విద్యాసంస్థలు ప్రభుత్వం నుంచి ఒకటి నుంచి ఏడో తరగతి వరకు మాత్రమే అనుమతులు పొందినా, నిబంధనలకు విరుద్ధంగా పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులు నిర్వహించేందుకు అవసరమైన అనుమతులు లేకుండానే పాఠశాలలు నడుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. స్థానిక ఎంఈఓ లకు ప్రతినెల మామూలు ఇచ్చి మేనేజ్ చేస్తున్నారు ఒక్కొక్క ఎంఈఓ కు లక్షలలో మామూళ్ళు అందుతున్నాయి అన్న విమర్శలు ఉన్నాయి.

### ఫైర్, శానిటేషన్, ట్రాఫిక్ అనుమతులు లేకున్నా స్కూళ్లు ఎలా.?

వందలాది మంది విద్యార్థులు చదువుతున్న విద్యాసంస్థలకు ఫైర్ సేఫ్టీ, శానిటేషన్, ట్రాఫిక్ భద్రత వంటి కీలక అనుమతులు తప్పనిసరి. అయితే అనేక పాఠశాలలు ఈ నిబంధనలను పట్టించుకోకుండా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు నిబంధనలు పట్టించుకోకుండా కేవలం లంచాలు తీసుకొని అనుమతులు ఇస్తున్నారు అనేది బహిరంగ రహస్యంగా మారింది. అయినా విద్యాశాఖ మంత్రి ఉన్నత అధికారులు పట్టించుకోకపోవడం వెనక అంతర్యం ఏమిటో.? ఒకవేళ ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది.? విద్యాశాఖదా.? స్థానిక అధికారులదా.? లేక రాజకీయ అండదండలు అందిస్తున్న నాయకులదా.? అనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి.

### ప్రశ్నార్థకంగా మారిన జీవో 46..

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ కోసం తీసుకొచ్చిన జీవో 46 అమలు కేవలం కాగితాలకే పరిమితమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి పాఠశాల తమ ఫీజు వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలనే నిబంధన అమలులో కనిపించడం లేదు. పేరెంట్స్ కమిటీల ఏర్పాటు కూడా చాలా చోట్ల నామమాత్రంగానే ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఇది అంతా తెలిసివిద్యాశాఖ అధికారులు మౌనం వహించడం వెనక అంతర్యం ఏమిటని డ్యూటీ సక్రమంగా చేయడం లేదా.? లేక లంచాలకు అమ్ముడుపోయారా.? అన్నది విద్యా శాఖ మంత్రి కే తెలియాలి.ఫీజుల దోపిడీపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారుల నుండి అసలు కఠిన చర్యలు కనిపించడం లేదని విమర్శలు వస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకుల అండదండల కారణంగానే కొన్ని పాఠశాలలపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### గల్లీకో ప్లే స్కూల్.. గుప్పెడు నిబంధనలు కూడా లేవు..

గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని అనేక కాలనీలు, గల్లీల్లో అనుమతులు లేకుండా ప్లే స్కూల్స్, నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. విద్యా ప్రమాణాలు, భద్రతా ప్రమాణాలు, ప్రభుత్వ అనుమతులు ఏవీ లేకుండానే పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలిప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులపై నియంత్రణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రతి పాఠశాలలో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలను వెంటనే మూసివేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పిల్లల భవిష్యత్తు పేరుతో జరుగుతున్న ఈ ఫీజుల దోపిడీ కి ముగింపు పలకాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైననే ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.పిల్లల భవిష్యత్తు పేరుతో తల్లిదండ్రుల జేబులు కొల్లగొట్టే వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు కొరడా ఝుళిపిస్తుంది.? అనే ప్రశ్నకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుండే సమాధానం రావాల్సి ఉంది.

## తెలంగాణ ఎన్నారైలకు అలర్ట్

### - ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్ లింక్ తప్పనిసరి!




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ సహా తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) తమ ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) నేపథ్యంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. మొబైల్ నంబర్ లింక్ లేకపోతే, ఎన్నారైలు ఆన్‌లైన్‌లో తమ వివరాలను సమర్పించడం సాధ్యం కాదని, ఓటర్ల జాబితాలో చేరడంలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు తెలిపారు. ఎన్నారైలు తమ మొబైల్ నంబర్‌ను లింక్ చేయడానికి ఈసీఐ అధికారిక పోర్టల్ ను సందర్శించాలి. అక్కడ ఫారం 8 (ప్రస్తుత ఓటర్ల జాబితాలో వివరాల సవరణ)ను పూర్తి చేయాలి. మొబైల్ నంబర్ నమోదు చేశాక వచ్చే ఓటీపీతో ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.

అంతేకాకుండా, ఓటర్ ఐడీ కార్డులో ఉన్న పేరు, ఆధార్ కార్డులో ఉన్న పేరు ఒకేలా ఉండటం తప్పనిసరి అని, ఫారం సమర్పించేటప్పుడు ఆధార్ అథెంటికేషన్ అవసరమని అధికారులు నొక్కిచెప్పారు.తెలంగాణలో జరగనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీని ప్రకారం, జూన్ 15 నుంచి 24 వరకు ఓటర్ల జాబితా రూపకల్పన, జూన్ 25 నుంచి జూలై 24 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుంది. అభ్యంతరాలను ఆగస్టు 30 వరకు స్వీకరించి, అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ, తమ ఓటు హక్కును కాపాడుకోవాలనుకునే ప్రవాస భారతీయులకు ఈ ప్రక్రియ చాలా కీలకం. నిర్ణీత గడువులోగా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా వారు తమ రాష్ట్రంలోని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములుగా కొనసాగవచ్చు.

## పవన్‌పై వ్యాఖ్యలు కరెక్ట్ కాదు

### - తెలంగాణ నేతలకు చంద్రబాబు హితవు



అమరావతి (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ఇలాంటి మాటలతో అనవసర సమస్యలు సృష్టించవద్దని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు ఫలించవని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో తన యూనిట్‌ను ఏర్పాటు చేసుకుందని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పుడు ఏపీలో ఎలాంటి అభ్యంతరాలు తెలపలేదన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయి ఇప్పటికే 12 ఏళ్లు దాటిపోయిందని.. ఈ సుదీర్ఘ కాలంలో ఎవరెవరు ఏం చేశారనేది రెండు రాష్ట్రాల ప్రజలకు చాలా స్పష్టంగా తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఏవైనా సమస్యలు లేదా భేదాభిప్రాయాలు ఉంటే రాజకీయంగా, లాజికల్‌గా ముందుకెళ్లాలి తప్ప.. ఇలాంటి వ్యాఖ్యలతో రాష్ట్రాల్లో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టవద్దని సూచించారు."తెలంగాణలో పవన్ కళ్యాణ్ గారిపై కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదు. ఇలాంటి మాటలు మాట్లాడి లేనిపోని సమస్యలు సృష్టించకూడదు. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత ఇప్పుడు అనవసరంగా మాట్లాడి విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారు. కానీ అది సాధ్యం కాదు. ఏ ప్రాంతానికి ఎవరు ఏం చేశారో ప్రజలకు బాగా తెలుసు. నేను ఇటీవలే తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి వెళ్లి వచ్చాను. అక్కడకు కర్ణాటకతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల నేతలు వచ్చారు. కర్ణాటక నుంచి డీకే శివకుమార్ కూడా వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉన్నాయి. ఆ బీఆర్ఎస్ జాతీయ పార్టీ అని చెప్పి ఆంధ్రప్రదేశ్‌లో కూడా విస్తరిస్తామని అన్నారు. మరి ఇప్పుడు ఎందుకిలా మాట్లాడుతున్నారో నాకైతే అర్థం కావడం లేదు. ఇది సరైన విధానం కాదు.ఈ రోజు అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి దేశాల్లో ఎంతోమంది తెలుగువారు రాజ్యాంగ పదవుల్లో ఉన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో మనవాళ్లు పదవులు చేపట్టి, అక్కడి రాజ్యాంగం ప్రకారం పనిచేస్తున్నారు. ప్రజలకు ఎవరు మంచి సేవ చేస్తే వారే ఆయా ప్రాంతాల్లో నాయకులు అవుతారు. రాజకీయ నాయకులు అభివృద్ధిలో, ప్రజా సేవలో పోటీ పడాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి పెట్టాలి. అంతేకానీ ఇలాంటి విమర్శలతో ప్రజల మధ్య దూరం పెంచకూడదు" అని చంద్రబాబు హితవు పలికారు.

## అధికారుల నోటీసులు తూతూ మంత్రం

# చర్యలు మాత్రం శూన్యం

- ఏసీపీ ప్రతాప్ వైఖరిపై నిత్యం విమర్శలు
- టీపీఎస్ అర్చన ఆశీస్సులతోనే అక్రమ నిర్మాణాలా.?
- ప్రజా ఫిర్యాదులు పట్టించుకోని టౌన్ ప్లానింగ్ యంత్రాంగం



**ఎల్బీనగర్ (ప్రశ్న న్యూస్)** ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని బీడీ రెడ్డి గార్డెన్ నుండి నంది హిల్స్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ అక్రమ షెడ్ నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారులు కేవలం నోటీసులు జారీ చేయడానికే పరిమితమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు.అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాల్సిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం వ్యవహరిస్తున్న తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది. నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చామని అధికారులు చెబుతున్నప్పటికీ, పనులు మాత్రం యథావిధిగా కొనసాగుతుండటం వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోటీసులు జారీ చేయడం ఒకవైపు, నిర్మాణం కొనసాగడం మరోవైపు ఉండటంతో అవి కేవలం తూతూ మంత్రంగా మారిపోయాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.డిప్యూటీ కమిషనర్ భువనగిరి శ్రీనివాస్, ఏసీపీ ప్రతాప్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ అర్చన, చైన్‌మెన్ సత్యనారాయణల పర్యవేక్షణలోనే ఈ ప్రాంతం ఉండగా ఇంత పెద్ద నిర్మాణం ఎలా జరుగుతోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఏసీపీ ప్రతాప్ వ్యవహారం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని, ఫిర్యాదులపై స్పందన లేకపోవడం వల్ల అక్రమ నిర్మాణదారులు మరింత రెచ్చిపోతున్నారని ఆరోపిస్తున్నారు.టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ అర్చనపై కూడా స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

సెక్షన్ ఆఫీసర్ అర్చన ఆశీర్వాదం ఉంటే చాలు ఎన్ని అక్రమ నిర్మాణాలైనా చేసుకోవచ్చు అనే వ్యాఖ్యలు ప్రజల మధ్య వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యమా.? లేక లంచాలే కారణమా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ మున్సిపల్ నియమ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అందినంత దోచుకోవడమేనా డ్యూటీ..

అందినంత అందుకో దొరికినంత పుచ్చుకో అన్న ధోరణిలో ఎల్బీనగర్ సర్కిల్ లో కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో మున్సిపల్ శాఖ పై ప్రజల విశ్వాసం పూర్తిగా దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు.

## కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటు

### - విజయ్ సంచలన నిర్ణయం



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, తమ కూటమి భాగస్వామి అయిన కాంగ్రెస్‌కు రాజ్యసభ స్థానాన్ని కేటాయించింది. జూన్ 18న జరగనున్న ఉప ఎన్నికకు సంబంధించి ఖాళీగా ఉన్న ఏకైక రాజ్యసభ సీటును కాంగ్రెస్‌కు ఇస్తున్నట్లు టీవీకే అధినేత, ముఖ్యమంత్రి విజయ్ బుధవారం ప్రకటించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అన్నాడీఎంకే నేత సి.వి. షణ్ముగం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచినా, సాధారణ మెజారిటీకి కొద్ది దూరంలో ఆగిపోయింది. దీంతో కాంగ్రెస్, వీసీకే వంటి మిత్రపక్షాల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. డీఎంకేతో పొత్తును వీడి టీవీకేకు మద్దతు పలికిన కాంగ్రెస్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకే విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఈ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పార్టీ డేటా అనలిటిక్స్ విభాగానికి ఛైర్మన్‌గా ఉన్న ప్రవీణ్ చక్రవర్తి పేరు బలంగా వినిపిస్తోంది. ఆయన రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు. మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం సీఎం విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ కావడం కూడా ఈ ఊహాగానాలకు బలం చేకూర్చింది. టీవీకే, దాని మిత్రపక్షాల ఎమ్మెల్యేల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు లాంఛనప్రాయమే కానుంది. అభ్యర్థి ఎవరనే దానిపై కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ కేటాయింపుతో ప్రభుత్వ స్థిరత్వాన్ని కాపాడుకుంటూనే, కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎగువ సభలో ప్రాతినిధ్యం కల్పించినట్లవుతుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers".
H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588